POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. APTEL/26/A0220
ESTABLISHED : 1983
ఫిబ్రవరి 2026
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 43 సంచిక:10



## పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మహారాజ్

## బ్రహ్మానుభూతి పర్వదినము

(02.02.2026 తిథి) | (09.02.2026)

# ఈ నెల పండుగలు

ఫిబ్రవరి 02 - పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మహారాజ్ బ్రహ్మానుభూతి పర్వదినము
(మాఘ బహుళ పాడ్యమి)

ఫిబ్రవరి 02 - శ్రీ గురుడు అంతర్ధానము చెందిన రోజు (మాఘ బహుళ పాడ్యమి)

ఫిబ్రవరి 08 - శ్రీ గజానన మహారాజు ప్రకటమైన రోజు (మాఘ బహుళ సప్తమి)

ఫిబ్రవరి 08 - పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మహారాజ్ శిరిడీలో ప్రథమంగా అడుగిడిన రోజు

ఫిబ్రవరి 09 - శ్రీ సేలం మాయీ అమ్మ ఆరాధన

ఫిబ్రవరి 09 - పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మహారాజ్ బ్రహ్మానుభూతి పర్వదినము

ఫిబ్రవరి 15 - శ్రీ పాకలపాటి గురువుగారి ఆరాధన

ఫిబ్రవరి 18 - శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి (18-02-1836)

ఫిబ్రవరి 19 - శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి (ఫాల్గుణ శుద్ధ విదియ)









జ్ఞానాగ్నిలో అజ్ఞానాన్ని దహనం చేసేలా, పాతకు స్వస్తి చెప్పి కొత్తకు స్వాగతం పలుకుతూ మాతృదేవి సన్నిధిలో గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ గారు భోగి మంటలను వెలిగించారు. తదనంతరం గురుపుత్రిక శ్రీమతి వేదమ్మ గారు మాతృదేవి సన్నిధిలో పూజ చేసి, శ్రీ సాయిబాబా మరియు పూజ్య గురుదంపతులకు భోగిపళ్ళు సమర్పించారు.

# ఆధ్యాత్మికత - క్రమశిక్షణ

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

ఆధ్యాత్మిక క్రమశిక్షణలోని మొదటి రెండంశాలు తన పురోగతికి సంబంధించినవి. వాటిని పూర్తిగా పాటించకపోతే నిరంతరమూ మనపై భగవంతుడు వర్షించే అనుగ్రహాన్ని అంతమేరకు పొందలేము. **ఈ సూత్రం సాటి భక్తులపట్ల, సత్సంగ సభ్యులపట్ల మన ప్రవర్తనకు సంబంధించినది గనుక దానిని పాటించకుంటే సత్సంగం యావత్తునూ కలుషితం చేసి ఎందరి ఆధ్యాత్మిక పురోగతినో దెబ్బతీసిన దోషం సంక్రమిస్తుంది. కనుక దీనిని బాగా వివరించుకోవాలి.** ఇది గుర్తించక యీ సూత్రాన్ని ఉల్లంఘించి సాటివారి శ్రేయస్సును మన ప్రవర్తన వలన అనుక్షణమూ చెడగొడుతుంటే శిరిడీయాత్ర వలన మనం పొందగలిగేదేముంది? మన యిల్లు మన పాత వ్యక్తిత్వానికి సంకేతమైతే, శిరిడీ సందర్శనం మనలోని బలహీనతలను విడచి సన్మార్గాన్నాశ్రయించడానికి సంకేతం కావాలి. అలా శిరిడీ మళ్ళీ మళ్ళీ వెడుతూండడం ప్రతిరోజూ అవకాశమున్నప్పుడల్లా దైవచింతనను ఆశ్రయించడంలాంటిది గావాలి.

దయామయుడైన భగవంతుడు భక్తులు, సత్కర్మనిరతులూ అయినవారికి ప్రేమించే



సామర్థ్యమనుగ్రహిస్తాడు. (ఖురాన్, XiX 96) ఆయన వారిని ప్రేమిస్తాడు. కారణం సాటివారిపట్ల వారు తమ ధర్మాన్ని చిత్తశుద్ధితో పాటించి, తమ శ్రేయస్సుకంటె గూడ సాటివారి శ్రేయస్సునే ప్రధానలక్ష్యంగా పెట్టుకుంటారు.

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:43 ఫిబ్రవరి - 2026 సంచిక:10

*పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"*

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | **ఆధ్యాత్మికత - క్రమశిక్షణ** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | **పరిప్రశ్న** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | **ఆదర్శ కుటుంబము** | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | **బ్రహ్మజ్ఞుని బ్రహ్మానుభూతి** | శ్రీమతి శ్రీదేవి | 11 |
| 05. | **మాతృదేవి స్మృతులు** | శ్రీ సురేష్ | 14 |
| 06. | **శ్రీ గురుచరిత్ర సప్తాహ సత్సంగ ప్రవచన యాత్ర (శ్రీ క్షేత గాణ్గాపురం)** | శ్రీమతి టి. పద్మావతి | 16 |
| 07. | **వార్తాలాపము** | శ్రీమతి అడిదం వేదవతి | 19 |
| 08. | **భగవాన్ శ్రీ భరద్వాజ** | శ్రీమతి శ్రీదేవి | 22 |
| 09. | **ద్వారకామాయి అనుభవమండపము** | శ్రీమతి మధునాపంతుల ప్రియ | 25 |
| 10. | **ఆచార్యుని అద్భుత లీలలు** | శ్రీ మేడా జయరాం | 27 |


స్థలాభావం వల్ల ఈ సంచికలో 'శ్రీశ్రీ ఆనందమయి మాత చరిత్ర' మరియు 'బుద్ధ ధ్యాన హృదయము' ధారావాహికలు ప్రచురించబడటం లేదు - ఎడిటర్

చిరునామా
Sri Manga Bharadwaja Trust,
Kondaiah Bunk Street, Kothapeta,
Ongole, Prakasam District, A.P. - 523002
Phone No. 08592 233271
**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

### చందా వివరములు

| | |
|---|---|
| విడి ప్రతి | : ₹10-00 |
| సంవత్సర చందా | : ₹100-00 |

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

ప్రవక్త యిలా అన్నారు – "సాటివారికి నీ పైగల ప్రేమను హృదయ పూర్వకం చేసేవి మూడంశాలు. (1) వారిని కలుసుకొన్నప్పుడు నీవే మొదట సలాము చేయడమూ, పలకరించడము; (2) ప్రక్కకు ఒదిగి వారిని కూర్చోమని ఆహ్వానించడము, (3) వారికెలా సంబోధిస్తే యిష్టమో అలా సంబోధించడము." కారణం భగవంతుడిలా చెప్పాడు: "భక్తులందరూ సోదరులు. కనుక వారి హృదయాలను రాజీ చేయడం మా విధి".

(ఖురాన్ XLiX, 10) ప్రవక్త యిలా చెప్పారు – "సాధ్యమైనంత మందిని సన్మార్గంలోకి తీసుకురా; పరలోకంలో అందరి యెదుట నిన్ను శిక్షించడానికి ఆయన వెనుకాడుతాడు". అంటే యితరులను సన్మార్గంలోకి తెచ్చిన పుణ్యం భగవంతుని క్షమను మనకు లభింపజేస్తుందని ఆయన భావం. అయితే ఏ అనుబంధమైనా భగవంతునిపరంగానే వుండాలి. మన స్వార్థానికో లేక వ్యర్థమైన కాలక్షేపానికో పనికివచ్చేదిమాత్రం గాకూడదు. ఈ జాగ్రత్త తీసుకొంటే మాత్రమే సాధకులకు సత్ఫలితముంటుంది. "ఎవరి సాంగత్యంవలన నీకెట్టి ఆధ్యాత్మిక ప్రయోజనమూ వుండదో, వారి సాంగత్యాన్ని వెంటనే విడిచివేయాలి" అన్నాడు మాలిక్ దినార్. అంటే మనకంటే ఆధ్యాత్మికంగా వున్నత స్థితిలో వున్నవారుగానీ, లేక తక్కువ స్థాయిలోవున్నా చిత్తశుద్ధిగల భక్తుల సాంగత్యంలోగాని వుండాలని భావం.

మనకిగాని, సాటివారికిగాని ఆధ్యాత్మిక శ్రేయస్సునివ్వగల సాంగత్య మొక్కటే తగినది. అందుకే ప్రవక్త అన్నారు, "తెలియనివారికి తెలియజెబుతుండడమే పవిత్రత". ఇందువలన మనం తెలుసుకొన్నవి స్మరించి, మన హృదయంలోనూ, ఆచరణలోనూ వాటిని మనం పటిష్టం చేసుకొనడానికి భగవంతుడిచ్చిన అవకాశమే ఆ సాంగత్యమన్న భావముండాలి .

**"ఎవరినైతే నీవు, నీ ప్రార్థనలో నా శ్రేయస్సును గూడ మరువకు అని పదేపదే కోరవలసివస్తుందో అతడు సరియైన స్నేహితుడేగాదు" అన్నారు ప్రవక్త. క్షణకాలమైనా పరిచయమైన ప్రతివారికోసం ప్రార్థించడం సాధకుని విధి. సర్వజీవుల శ్రేయస్సుకోసం ప్రార్థించడం మహాత్ముల పని. కారణం వారు వాచా, కర్మణాగూడ అందుకై పాటుపడుతుంటారు. వెంట్రుకవాసిగూడ అందుకు ప్రయత్నించక వాచా మాత్రమే అలా ప్రార్థించడం కపటం. అది మనమెంతో పవిత్రులమని అహంకరించడమే అవుతుంది. ఇందుకు ఋజువు నిత్యజీవితంలో కొందరిపట్ల మనము అసూయా, ద్వేషము, పట్టుదల వహించడమే.**

మరో విషయం : నీవు ప్రతి చిన్న పొరపాటుకు క్షమాపణ చెప్పుకోవాల్సివస్తే అతడు భక్తుడేగాదు, సాధకుడేగాదు. కారణం క్షమాపణ అన్నది పరాయివారికి, అపరిచితులకూ మాత్రమే తగినది. భక్తులు, సాధకులు సోదరులవంటివారు. వారి మధ్య అది తగదు. కనుక దానిని కోరడం మన భక్తికే లోటు. మనిషికి సాటివారి ఆచరణను అనుసరించడం సహజం గనుక మనమెవరితో స్నేహం చేస్తామన్నది సాధకునికి ముఖ్యమన్నాడు ప్రవక్త. మంచివారి సాంగత్యంలో చెడ్డవారు గూడ మంచివారవుతారు. చెడ్డవారి సాంగత్యంలో మంచివారుగూడ చెడ్డవారవుతారు. కారణం అనుక్షణమూ మొహమాటంవల్లనైనా వారి చెడ్డతనాన్ని అతడు ఆమోదించవలసివస్తుంది.

**ఒక భక్తుడు, "నా సాటివారిని మంచిమార్గంలోనే నడిపించు" అనిమాత్రమే ప్రార్థించేవాడు. తనకోసమేమీ భగవంతుని కోరలేదేమని ప్రశ్నించినవారితో, "నా జీవితంలో ఎక్కువ భాగం సాటి భక్తులతోనే గడపవలసి వస్తుంది. వారంతా మంచిమార్గంలో వుంటే వారి సాంగత్యం వలన నేనూ మంచిమార్గంలో వుంటాను కదా!" అన్నాడు.●**

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

***ప్రశ్న :- అసూయా ద్వేషాలతో నిండిన ఈ సంఘములో మానవుడు ఆధ్యాత్మిక పథంలో పురోగమించుట సాధ్యమా? జీవనవిధి నిర్వహించుచూ పయనించడమెలా?***

***- ఎమ్. ఎస్. రెడ్డి, కడప***

**జవాబు :-**1-4-87 సంచికలో శ్రీరామనవమి ప్రత్యేక సందేశము వ్యాసంలో కొంత వివరించాను. పైన చెప్పిన రీతిన యుక్తితో యథాశక్తి ఆధ్యాత్మభావంతో జీవించడానికి యత్నిస్తూ, అట్టి గ్రంథాలను అధ్యయన మననాదులు చేస్తూ, అవగాహనను సాటివారితో ప్రయత్న పూర్వకంగా పంచుకుంటూ, అట్టి యత్నాన్నే వారిలోనూ మేల్కొల్పడానికి తీవ్రయత్నం చేయాలి. అట్టి మనోవికాసం ప్రస్తుత పరిస్థితులలో వ్యక్తి నుండి వ్యక్తికి సంక్రమించవలసినదే. దీనినే "స్వాధ్యాయ ప్రవచనేచ నప్రమదితవ్యం" అన్న శృతి చెబుతుంది. ఈ జాగ్రత్తను మన వెనుకటి తరాలవారు తీసుకోకపోవడం వల్లనే ఈనాడీ దుస్థితి కలిగింది. ఉగ్గుపాలతో ఇట్టి అవగాహనను మనకి ప్రాచీనులందిస్తూ వచ్చారు గనుకనే ప్రపంచంలో ప్రాచీన సంస్కృతులన్నీ నశించిపోయిన తర్వాత గూడా మన సంస్కృతి ఈనాటికి ఇంతమాత్రమైనా నిలిచివున్నది. ఆ సంస్కృతీ వృక్షమీనాటికీ మహనీయులనబడే పండ్లను మనకందించగలుగుతున్నది.

ఈనాడు మన సమాజం నైతికంగా పతనం గావటానికి కారణ మొక్కటే. పునర్జన్మ, స్వర్గాదిలోకాలు, దైవాన్ని గూర్చి నమ్మలేని వారికి సహితం వ్యక్తి నైతికంగా ప్రవర్తించడం ఎందుకు సరియైనదో వివరించేవారు లేకపోవడమే.

బలమైన ప్రాణి బలహీనమైన వాటిని హింసించి స్వలాభాన్ని చేకూర్చుకునే ఈ అనంత జీవసృష్టిలో మానవజాతి మాత్రమే ఈ నైతిక సూత్రాన్ని ఎందుకవలంభించ యత్నించాలి? వాటికిలేని తమకుగల ఈ బుద్ధి శక్తే యిందుకు కారణమంటే, మరి ఎక్కువమంది అలా ఆచరించలేకున్నారు గదా! కాని మరొకవంక శుద్ధమైన అవగాహన కల్గి నచ్చాక ఎట్టి ఆదర్శం కోసమైనా ప్రాణాలొడ్డి కొందరు కృషి చేయడం గూడ చూస్తున్నాము.

కనుక నైతికత ఏమిటో, ఎందుకావశ్యకమో క్షుణ్ణంగా తెలిసినపుడు మానవులెక్కువ మంది దాని నాచరించకుండా వుండలేరు. కనుక మనలో ప్రతి ఒక్కరు అట్టి అవగాహనను సాధించడము, దానిని సాటివారితో పంచుకోవడము బుద్ధిశక్తిగల మానవజాతికి పరమధర్మం. అందుకు సుముఖతే సత్వగుణమని, దైవీసంపదనీ; అవిలేని యజ్ఞ, దాన, తపః కర్మలు నిష్ఫలములవుతాయని భగవద్గీత గూడ చెబుతుంది. "ఇదంతా అనావశ్యకము. ఒకరి సంగతి మనకనవసరము; మనవరకు ముక్కు మూసుకుంటేచాలు" అన్న నేటి ఆస్తికుల సాధన వ్యర్థమవుతున్నది. ఇట్టి అవగాహనను సాధించి ఆచరించడంద్వారా శాస్త్రాలలో చెప్పిన చిత్తశుద్ధిని పూర్ణంగా యిదివరకే సాధించిన యీనాటి మహనీయులకి ఏ కొంత

***మిగతా 21వ పేజీలో***

*(నవంబర్ 2011 సాయిబాబా మాసపత్రిక నుండి)*

# ఆదర్శ కుటుంబము

**పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ**

భార్య, భర్త, తల్లి, తండ్రి, పిల్లలు కలిసి ఒక కుటుంబము. సామాన్యంగా కుటుంబ సభ్యులందరు ఒక యింట్లో కలిసి జీవిస్తారు. వారి సంఖ్య యెంతైనా వుండవచ్చు.

ఒక కుటుంబములోని వారందరూ అన్ని విషయాలలోనూ ఒక పద్ధతి ప్రకారం ఉమ్మడిగా వ్యవహారం నడుపుతారు. అలాగే కుటుంబ సభ్యుల మధ్య సమన్వయము, ఆత్మీయత వుంటాయి. ప్రస్తుత కాలంలో మనకున్న సమస్యలలో అతి ముఖ్యమైనది కుటుంబ సమస్య. కుటుంబంలోని సభ్యులకు ఒకరంటే ఒకరికి యిష్టం వుంటుంది. కానీ ఒకరంటే ఒకరికి ఏమాత్రం పడదు. అతి చిన్న విషయం దగ్గరనుంచి అతిపెద్ద విషయందాకా భేదాభిప్రాయాలతో నిరంతరమూ కలహించుకుంటూనే వుంటారు. ఒక క్షణం కలిసినట్లున్నప్పటికీ మరుక్షణమే ఏదో ఒక తగవు. అందువలన ఎవరికీ మనశ్శాంతి వుండడం లేదు.

మానవ మనుగడకు కుటుంబ వ్యవస్థ జీవగఱ్ఱ. అది సరిగా లేకపోతే మానవ మనుగడ అస్తవ్యస్తమవుతుంది.

అందుకే మన పెద్దలు కుటుంబంలోని వ్యక్తులు యెవరెవరు యేమేమి చేయాలో, యెవరెవరిపట్ల యెలా ప్రవర్తించాలో చెప్పారు. ఆ విధంగా నడుచుకుంటే కుటుంబం శాంతి సౌఖ్యాలతో వుంటుందని వారు చెప్పారు.

కుటుంబంలోని వ్యక్తులందరూ ఒకే మాట మీద నిలబడాలని పెద్దలు చెప్పారు. అసలు కుటుంబమంతా ఒకే మాట మీద ఎందుకు నిలబడాలి? ఎవరి అభిప్రాయాలు వారికుంటాయి గదా! అని మనకనిపించవచ్చు. కానీ ఒకేమాట మీద నిలబడకపోతే ఆ కుటుంబం ఎట్లా వుంటుందో ఒక్కసారి ఊహించుకుంటే మనకే అర్థమవుతుంది. తల్లిదండ్రుల మాట పిల్లలు వినరు, వాళ్ళు చెప్పేది పిల్లలకు యిష్టముండదు. అలాగే పిల్లల అభిప్రాయాలు పెద్దలు పట్టించుకోరు. అలాగే భార్య, భర్త, తల్లి, తండ్రి, అన్నదమ్ములు– ఎవరి యిష్టమొచ్చినట్లు వాళ్ళు వుండాలని అనుకుంటారు. ఒకరికొకరికి పొత్తు కుదరదు. అప్పుడు ఏమవుతుంది? ఇల్లు రణరంగంగా మారుతుంది. చివరికి విజయం ఎవరిదైనా కావచ్చు. అంటే యెవరి మాటైనా చెల్లవచ్చు. కానీ అవతలివాళ్ళు తప్పక తలొగ్గడమే అవుతుందిగానీ యిష్టముండిగాదు. అందువలన ఒకరిపై ఒకరికి ప్రేమ వుండడం పోయి కోపము, ద్వేషము మొ॥నవి యేర్పడతాయి. అందువలన కుటుంబంలో ప్రశాంతత, మనశ్శాంతి కరువవుతాయి. నేడు చాలా కుటుంబాలలో జరుగుతున్నది యిదే.

దీనికి మూలకారణమేమిటి? ఎవరికి వారు ధర్మం తప్పడం వల్లనా? లేక ధర్మం తెలియక పోవడం వల్లనా? ధర్మం తెలిసివుంటే ధర్మం ప్రకారం నడుచుకోవడమో లేక తప్పడమో జరుగుతుంది. ధర్మం తెలియకపోతే తప్పడమేమున్నది? తప్పటడుగులు వేయడమే జరుగుతుంది. ప్రస్తుత పరిస్థితి దాదాపు యిదేనని చెప్పవచ్చు. నేటి సమాజంలో చాలామందికి ధర్మమంటే ఏమిటో సరిగా తెలియదు. సరిగా చెప్పేవారూ కరువైనారు. కనుక తెలిసినా తెలియకపోయినా పరిస్థితి ఒకటే.

అందుకే మన పెద్దలు కుటుంబ వ్యవస్థను పటిష్టంగా, నిర్దుష్టంగా రూపొందించారు. ఎవరి ధర్మాన్ని వారు పాటిస్తే యెటువంటి సమస్యలూ వుండవని వారు చెప్పారు. అందుకని ప్రతివారూ ధర్మతత్పరులై వుండాలి. అలా వుండాలంటే ధర్మం తెలియాలి.

అయితే మనకు ధర్మమెలా తెలుస్తుంది? పెద్దలు చెప్పిన ధర్మసూత్రాలు మనకు తెలిసినప్పటికీ అవి కొండ గుర్తులలాగనే. కానీ నిత్యజీవితంలో అడుగడుగునా ఎదురయ్యే పరిస్థితులు, సమస్యల పట్ల మనం ధర్మంగా యెలా వుండాలో మనకు తెలియజెప్పవు. వాటిని యెవరికివారము ఆలోచించి తెలుసుకోవలసిందే. అప్పుడు మన ఆలోచనలు సరియైనవి అవునో కాదో యెలా తెలుసుకోవడం? అడుగడుగునా మనకు యెవరు చెబుతారు? దీనికి పరిష్కారమెలా?

దీనికి పరిష్కార మార్గం 'ధర్మ ప్రబోధమే'. అది



జరగాలంటే. దానిని తెలిసి ఆచరించినవారుండాలి. అట్టివారే మహాత్ములు. తాము ధర్మం ఆచరించి జీవిత గమ్యం తెలుసుకుని దానిని పొందిన వారే యితరులకు సరియైన మార్గాన్ని బోధించగలరు.

**అసలిప్పుడు కుటుంబ వ్యవస్థ గురించి ప్రస్తావించుకోవడం అవసరమా? మనం ఆధ్యాత్మిక మార్గంలో వున్నవాళ్ళము గదా! ఆధ్యాత్మికత గురించి మాట్లాడుకోవాలిగానీ యివన్నీ యెందుకు? అని కొందరికి అనిపించవచ్చు. కారణం అధ్యాత్మికత - లౌకికత వేరు అన్న భావం మనలో పాతుకుపోయింది. ఆలోచిస్తుంటే, 'పూజ్యశ్రీ మాస్టరుగారు యీ అపార్థాన్ని తొలగించటానికే అవతరించారా!' అనిపిస్తుంది. కారణం ఆయన లౌకిక జీవితము - ఆధ్యాత్మికత వేరుగావనే విషయాన్నే బోధిస్తూ వచ్చారు.**

**కుటుంబ సమైక్యతే జాతి సమైక్యత. జాతి సమైక్యతే దేశ సమైక్యత. అందుకని కుటుంబమునుంచే సవరణ జరగాలి.**

అయితే అది యే విధంగా వస్తుంది? అంటే మానవ జీవితానికి ఆధ్యాత్మిక లక్ష్యం వుండాలి. ఆధ్యాత్మికత ఏమి చెబుతుందో తెలుసుకుంటేగాని లౌకిక జీవితం యెలా గడపాలో అర్థంగాదు. అది అర్థంగానిదే ఆచరణ సాధ్యం గాదు. కనుక నిజమైన ఆధ్యాత్మికత యెలా వుంటుందో, అది లౌకిక జీవితాన్ని ధర్మబద్ధంగా, శాంతియుతంగా యెలా మలుస్తుందో తెలియజెప్పేవారు గావాలి. అటువంటివారే నిజమైన ఆధ్యాత్మిక వేత్తలు.

ఈనాడు యెందరో నకిలీ గురువులు లౌకిక కోరికలతో తమ వద్దకు వచ్చినవారిని ఆధ్యాత్మికత పేరిట అనేక విధాలుగా మోసపుచ్చుతున్నారు. ఒక రకంగా వారికి brain wash చేసి, వారిని blackmail చేస్తున్నారనే చెప్పవచ్చు. ఆధ్యాత్మికత అంటే యేమో తెలియని ప్రజలు, తమ కోరికలు తీరడంతో, అదే ఆధ్యాత్మికత అని నమ్మి, తమకటువంటి మేలు చేసినవారిని నిజమైన ఆధ్యాత్మిక వేత్తలుగా, జగత్స్వరూపులుగా భావించి సేవిస్తున్నారు. కొంతమంది తమ మనోధనాలను వారికి అర్పిస్తున్నారు. నిజమైన ఆధ్యాత్మికత అంటే యేమిటో అట్టి నకిలీ




గురువులకే తెలియదు గనుక వారుగూడ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కనుక వైద్యం తెలియనివాడు వైద్యం తెలుసుననుకుని, వైద్యుడిననుకుని వైద్యం చేస్తే యెలా వుంటుందో, అలాగే యీ భవరోగానికి వారు నకిలీ వైద్యులవుతున్నారు. అందుకనే అట్టి గురువుల వద్దకు వెళ్ళే అసంఖ్యాక జనం వారిని యెంతగానో సేవించినప్పటికీ కుటుంబాలలో శాంతి మాత్రం లభించడం లేదు. ఇక యీ పరిస్థితి చక్కబడేదెలా?

**అలాగాక నిజమైన అధ్యాత్మికత అంటే ఏమిటో శోధించి, దానిని సాధించినవారే మహాత్ములు. అట్టివారే పూజ్యశ్రీ మాస్టరుగారు. ఆయన వాచాగాక ఆచరించి చూపారు గనుకనే ఆచార్యులు అయినారు. ఆయన జీవిత విధానాన్ని మనం పరిశీలనగా గమనిస్తేగాని లౌకికతకు -- పారమార్థికతకు గల సంబంధం మనకు అర్థంకాదు. లౌకికత, పారమార్థికతకు యెటువంటి ఆటంకమూ కాదని, నిజమైన పారమార్థికత ధర్మబద్ధమైన లౌకిక జీవితాన్ని ఆచరించేలా చేస్తుందని, ధర్మబద్ధమైన లౌకిక జీవితం పారమార్థికతకు దారితీస్తుందని ఆయన చెప్పేవారు.**


**నిజమైన ఆధ్యాత్మికవేత్త ధర్మమాచరిస్తాడు. పరిస్థితులతో సర్దుకుపోతాడు. పరిస్థితులను సరిదిద్దుకుంటాడు. అందుకే శాంతిగా వుంటాడు. ఇతరులకు శాంతిని కలుగజేస్తాడు.**

**పూజ్యశ్రీ మాస్టరుగారి విషయంలో యిది అక్షర సత్యం. ఆయన ధర్మాన్నెన్నడూ తప్పలేదు. ఆధ్యాత్మిక జీవితాన్ని వీడనూ లేదు. ధర్మబద్ధమైన లౌకిక జీవితాన్ని గడుపుతూనే ఆధ్యాత్మికతను సాధించారు. కనుకనే ఆయన నిజమైన ఆధ్యాత్మికవేత్త. అందుకనే ఆయన నేటి కుటుంబ అస్తవ్యస్త పరిస్థితికి చక్కని పరిష్కార మార్గం చెప్పారు. అదే సమర్థ సద్గురుడైన శ్రీ సాయిబాబాను పరిచయం చేయడం.**

శ్రీ సాయిబాబా ప్రత్యేకించి ధర్మ ప్రబోధం చేయనప్పటికీ ఆయన అప్పుడప్పుడూ చెప్పిన అమృతవాక్కులు, ధర్మవచనాలే నిత్యజీవితంలో మనకు అడుగడుగునా వుపయోగపడతాయి. పూజ్యశ్రీ మాస్టరుగారు వాటినన్నింటినీ ఒకచోట చేర్చి, కూర్చి **'శ్రీ సాయిబాబా సూక్తులు'** గా మనకు **'శ్రీసాయి లీలామృతము'** లో అందించారు. వాటిని ఆచరించడానికి ప్రయత్నిస్తుంటే చాలు. అనుక్షణము అవే మనకు మార్గదర్శకాలవుతాయి.

ఉదాహరణకు – 'పని చెయ్యి, దేవుని నామముచ్చరించు, సద్గ్రంథాలు చదువు' అన్న బాబా సూక్తిని ఆచరించడానికి ప్రయత్నిస్తూంటే పని చేయడం ప్రారంభిస్తాము. ఈ 'పని చెయ్యి' అనే సూక్తికి అర్థం యేదో ఒక పని మాత్రమే చేయడమనికాదు. సాధ్యమైనంత యెక్కువ పని చేయడమని. అప్పుడేం జరుగుతుందంటే మనం మన పనులు చేసుకోవడం మాత్రమేగాక యితరుల పనులుగూడ చేస్తాము. ఆ విధంగా యితరుల పనిలో పాలుపంచుకోవడం వల్ల

వారికి పని తగ్గించిన వాళ్ళమవుతాము. దాని వలన బద్ధకము, యితరులకు మనమెందుకు చెయ్యాలి అనే భావన తొలగి నిస్వార్థత మనలో నెలకొంటుంది. పని చెయ్యమనడం దేవుని నామముచ్చరిస్తూ చేయమన్నారు గనుక భగవంతుని స్మరించడం జరుగుతుంది. చేసే పనిని భగవంతుని సేవగా భావిస్తూ చేస్తే భగవంతునిపై అంతకంతకూ భక్తి భావం పెరుగుతుంది. అంతేగాక 'సద్గ్రంథాలు చదువు' అన్నారు బాబా. మంచి పుస్తకాలు చదవడంవల్ల పెద్దలు యేమి చెప్పారో, వారు మనలను యేమి చేయమని చెప్పారో మనకు తెలిసి ఆచరించడానికి ఆసక్తి కలుగుతుంది. **మహాత్ముల చరిత్రలు పఠించడంవల్ల వాళ్ళ ఆచరణ, సూక్తులు మన మనస్సులకు హత్తుకుని అలా ఆచరించడానికి వుద్యుక్తులమవుతాము.** అలా ఆచరించడానికి ప్రయత్నిస్తున్నకొద్దీ మనలో ఒక విధమైన




శాంతి, తృప్తి కలిగి అంతకంతకూ ఆ మార్గాన నడవాలనే ప్రీతి కలుగుతుంది. మనము మహాత్ములు చెప్పిన ప్రకారం ఆచరించడానికి ప్రయత్నిస్తుంటాము గనుక, వారికి ప్రీతి పాత్రులమవుతాము. అప్పటినుండి వారి అనుగ్రహం మనపై ప్రసరిస్తూ వుంటుంది.

అలాగే 'వంతులు, కీచులాటలు వద్దు' అని, "ఎవరెవరిపై కోపగించినా నాకు బాధ కలుగుతుంది' అని, 'వాదించవద్దు, పది మాటలకు ఒక మాటతో సమాధానం చెప్పు' మొ॥న బాబా చెప్పిన సూక్తులను ఆచరించడానికి ప్రయత్నించినపుడు మనకు యితరులతో తగువులాటలు తగ్గిపోతాయి.

అలాగే మామూలుగా మనకు సహజంగా వుండే అసూయను జయించడానికి బాబా యిచ్చిన వివరణతో అతి కష్టమైన అసూయను జయించడం సులువుగా మారిపోతుంది.

**ఈ విధంగా బాబా చెప్పిన సూక్తులను ఆచరించడానికి ప్రయత్నిస్తుంటే మనకు, మనవల్ల యితరులకు యెంతో శాంతి లభిస్తుంది. ఆ విధంగా కుటుంబంలోని వారందరూ ప్రవర్తిస్తే ఆ యిల్లు ప్రశాంతంగా వుండక యేమవుతుంది? ఈ విధమైన ప్రవర్తనవల్ల యెంతో కష్టతరమైన ధర్మబద్ధ జీవితం అతి సహజంగా మారుతుంది. కుటుంబం యెలా వుండాలని మన పెద్దలు చెప్పారో అలా వుంటుంది. అట్టి కుటుంబం యితరులకు ఆదర్శమవుతుంది.**

"మనకు ఆధ్యాత్మికత కావాలన్నా, లౌకికంగా శాంతిగా జీవించాలన్నా బాబా సూక్తులను ఆచరించక తప్పదు" అని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేవారు. కనుక పూజ్యశ్రీ మాస్టరుగారి 75వ జన్మదిన సందర్భంగా తలపెట్టిన 'కృతజ్ఞతా మహోత్సవ' సందర్భంగా మనం ఆయన చెప్పినట్లు బాబా సూక్తులను ఆచరించడానికి ప్రయత్నిద్దాము. తద్వారా పూజ్యశ్రీ మాస్టరుగారి యొక్క శ్రీ సాయిబాబా యొక్క అనుగ్రహాన్ని, కుటుంబంలో సుఖశాంతులను పొందుదాము.●

# బ్రహ్మజ్ఞుని బ్రహ్మానుభూతి

***శ్రీమతి శ్రీదేవి***

శ్రీ భరద్వాజ గురుదేవులు విశ్వగురుడైన శ్రీసాయినాథుని దివ్యానుగ్రహాన్ని పొందిన అత్యంత శుభప్రదమయిన రోజు 1963వ సంవత్సరం ఫిబ్రవరి 9వ తేది.

శ్రీ భరద్వాజ భగవానులు తమ మమతానురాగాలు చూరగొన్న తమ అన్నగారి 2-1/2 సంవత్సరాల వయస్సుగల కుమారుడి ఆకస్మిక మరణంతో విచలితులై, జనన మరణాల మూలాన్ని, సృష్టితత్త్వాన్ని తెలుసుకొనేందుకై కొన్ని సంవత్సరాలపాటు అన్వేషణ కొనసాగించారు. కఠిన సాధనలు చేశారు. ఆయన చేసిన యీ అన్వేషణ ఫలించినదనటానికి సంకేతంగా అనూహ్యమయిన రీతిలో ఆయన శిరిడీ వెళ్ళటం, సమాధి మందిరంలో శ్రీసాయినాథుని సన్నిధిలో 6 గంటల పాటు నిశ్చల సమాధిస్థితిని పొందటం జరిగింది. **అటువంటి మహోన్నతమైన దివ్యానుగ్రహాన్ని పొందిన సందర్భంగా ప్రత్యేకంగా యీ ఫిబ్రవరి తొమ్మిదవ తేదీన ప్రతియేటా భక్తులు ఒక గొప్ప పర్వదినంగా జరుపుకొనటం వలన మనమంతా వారి దివ్యత్వాన్ని మనసారా స్మరించి వారు బోధించిన ధర్మాచరణ వైపు, ఆధ్యాత్మిక మార్గంవైపు నడిచేలా స్ఫూర్తిని పొందుతామనటంలో సందేహం లేదు.**

శిరిడీ వెళ్ళకముందు అన్వేషకుడుగా వున్న భరద్వాజగారు శిరిడీలో సద్గురు సమాగమంతో, వారి అనుగ్రహంతో బ్రహ్మానుభూతిని పొందిన తర్వాత తాను పొందిన బ్రహ్మానుభూతి సకల జనావళి పొందాలన్న ఆకాంక్షతో ప్రజలను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించేందుకు కృషి చేశారు. సృష్టి, స్థితి, లయములకు మూలభూతమైన ఆ నిర్గుణతత్త్వాన్ని తెలుసుకొన్నప్పుడే మానవుడు సకల దుఃఖముల నుండి విముక్తుడవగలడని బోధించారు. అందుకు గురువు యొక్క ఆవశ్యకతను తెలియజెప్పి సద్గురు సాయినాథుని ఆశ్రయించేలాగా ప్రజలను ఉత్తేజపరిచారు. జనులలో సాయినాథునిపై భక్తిని పెంపొందించేందుకై తమ జీవితమంతా కృషి చేశారు. క్షణక్షణం తాము సాయినాథుని స్మరిస్తూ వారి కీర్తిని నలుదెసలా విస్తరింపజేశారు.

**శ్రీ భరద్వాజ గురుదేవులు బ్రహ్మానుభూతిని పొందిన యీ పర్వదిన వేడుకను జరుపుకొంటున్న యీ సందర్భంలో అసలు బ్రహ్మానుభూతి అంటే యేమిటి? ఆ అనుభూతి యెలా వుంటుంది? దానిని పొందవలసిన ఆవశ్యకత యేమిటి? - అనే విషయాలపై మహాత్ములు యేమని చెప్పారో కొంత విశ్లేషించుకొనటం యెంతో అవసరం.**

మొదటగా 'బ్రహ్మానుభూతి అంటే యేమిటి?' అన్న విషయం గురించి మహాత్ములు దుఃఖరహిత ఆనంద స్థితి – అన్నీ, అంతా తానైన స్థితియే బ్రహ్మానుభూతి అని చెప్పారు.

'ఆ అనుభూతి యే విధంగా వుంటుంది?' అనే ప్రశ్నకు సమాధానంగా 'బ్రహ్మానుభూతిని స్వయంగా అనుభవించి తెలుసుకొనాలి గాని దానిని మాటలలో చెప్పటం అసాధ్యం' అని మహాత్ములు చెప్పారు. అందుకు వారు కొన్ని వుదాహరణల ద్వారా మనకు యీ విషయం స్పష్టం చేశారు. ఎన్నడూ తియ్యని బెల్లపు ముక్కను రుచి చూసి యెరుగని ఒక వ్యక్తి 'బెల్లపు ముక్క రుచి యెలా వుంటుంది?' అని యెవరినైనా అడిగితే, వారు 'తీయగా వుంటుంది' అని మాత్రమే చెప్పగలరుగాని, ఆ రుచిని యెంతగా వర్ణించి చెప్పినా దానిని తిన్నప్పుడు కలిగే

రుచిని మాటలలో చెప్పటం సాధ్యం కాదు. మరి యే యితర తీపి పదార్థంగానీ, పండుగాని ఖచ్చితంగా బెల్లపు ముక్క రుచిని పోలి వుండదు కదా!

అలాగే బ్రహ్మానుభూతి మాటలలో వ్యక్తపరచ వీలుకానిది. పరిమిత శక్తి మాత్రమే కల మన వాక్కు, మనస్సులకు ఆ అనుభూతిని వెల్లడించగల సామర్థ్యము వుండదు. అందుకే 'బ్రహ్మానుభూతి మనోవాగతీతము' అని ఋషులు చెప్పారు.

ఇక రెండవ ప్రశ్న – 'బ్రహ్మానుభూతిని పొందటం యెలా?' – అన్నది. ఈ విషయమై మహాత్ములంతా ఒకటే చెప్పారు, 'బ్రహ్మానుభూతి పొందగోరిన వాడు గురువు నాశ్రయించి సాధన ద్వారా పొందవచ్చు' అని! అయితే సద్గురువు సాధనా మార్గాలను మాత్రమే చెపుతాడు. ఆ మార్గాలననుసరించి సాధకుడు సాధన చేసి బ్రహ్మజ్ఞానం పొందవలసి వుంటుంది గానీ అది కోరగానే వరం యిచ్చినట్లుగా యెవరిచేతా యెవరికీ ప్రసాదింపబడేది కాదు. మనం క్రొత్తగా ఒక వూరు వెళ్ళి ఆ వూరిలోని ఒక దేవాలయం దర్శించుకోవాలనుకొన్నప్పుడు ఆ వూరి వారిని ఆ దేవాలయం గురించి అడిగితే వారు 'ఫలానాదిక్కుగా, ఫలానా దారిగుండా వెళితే గుడిని చేరుకొనవచ్చు' అంటూ మార్గం చూపుతారు. అలాగే మహాత్ములు దిశానిర్దేశం చేస్తారు. దాహంతో వున్న గుఱ్ఱాన్ని చెఱువు వరకు తీసుకొని వెళ్ళగలం కానీ దాని చేత మనము నీటిని త్రాగించలేము కదా! గుఱ్ఱం తనకు తాను నీరు త్రాగి దాహం తీర్చుకొనవలసి వుంటుంది. వేద వేదాంగాలు కూడా బ్రహ్మజ్ఞానాన్ని పొందటానికి మార్గాలను తెలిపాయి. మోక్షసాధనకు సూచనలు మాత్రమే యిచ్చి అక్కడే ఆగిపోయాయి. అంతే కానీ, వేదపారాయణ చేసినంత మాత్రాన బ్రహ్మజ్ఞానం పొందుతామని చెప్పలేదు. వేదమంత్రాలు వాక్కు ద్వారా మోక్షసాధనలను వివరించాయి గానీ, స్వయంగా వేదాలు బ్రహ్మానుభూతిని యివ్వలేవు. వేదాలు కూడా ఆ పరమాత్మ అన్వేషణలోనే వున్నాయి. మనోవాగతీతమైన ఆ బ్రహ్మానుభూతిని సాధకుడు కృషి చేసి స్వయంగా సాధించాలి. వేదాలకు సైతం అగోచరుడు, వేదాతీతుడు అయిన ఆ పరమాత్మను కృషితో సాధించవలసి వుంటుంది. అందుకే "నాన్ఘేఘాట్ దున్నపోతు మీద దాటటం కంటే కూడా కష్టం" అంటూ, శ్రీసాయి "ఆధ్యాత్మిక సాధనలో సర్వశక్తులూ ఒడ్డి కృషి చేయవలసి వుంటుంది" అని చెప్పారు. సాధన ఫలించినపుడు సాధనకు ఆధారభూతము అయిన మంత్రమయినా, శబ్దమయినా, ఆరాధనా రూపము అయినా, యేదయినా సరే – సర్వము అదృశ్యమై కేవలం మౌనమే మిగిలిపోతుంది. ఆ విధంగా ఆ నిశ్చల, నిశ్శబ్ద, నిరాకార, నిర్గుణ బ్రహ్మన్ని అనుభూతి పొందటమే లక్ష్య సిద్ధి అనబడుతుంది. ఇలా గురువు నాశ్రయించి, వారి అనుగ్రహంతో, కఠిన సాధన ద్వారా లక్ష్యసిద్ధిని సాధించవచ్చు.

ఇక మూడవది, అత్యంత ముఖ్యమయిన సందేహం – బ్రహ్మానుభూతిని పొందవలసిన ఆవశ్యకత యేమిటి? అనేది. ఈ ప్రశ్నకు మహాత్ములు యెంతో చక్కగా మానవ జీవిత స్వరూప స్వభావాల విశ్లేషణ ద్వారా మనకు వివరించారు. వారి బోధల సారాంశం యేమిటో నా అవగాహనకు అందినంత మేర తెలియజేస్తాను.

ప్రతి మనిషీ తన జీవితమంతా యెటువంటి కష్టాలు, బాధలు లేకుండా యెల్లప్పుడూ సంతోషంగా వుండాలని కోరుకుంటాడు. కానీ, యే ఒక్క మనిషి కూడా జీవితమంతా యే కష్టమూ లేకుండా సంతోషంగా గడపటం చూడము. సంపద, వున్నత పదవులు, సకల సౌఖ్యాలు వున్నప్పటికీ తృప్తిచెందక, మరింత డబ్బుకోసం, అధికారం కోసం, కీర్తికోసం తాపత్రయ పడుతుండటం మనం చూస్తుంటాం. ఒక ప్రక్క గత జన్మ కర్మానుభవాలుగా అనేక బాధలు, కష్టాలు, వేదనలు వెంటాడుతుంటాయి. మృత్యువు యెప్పుడు యే విధంగా సంభవిస్తుందో తెలియదు. ఇలా యెన్ని రకాలుగా ఆలోచించినా, అన్ని కోణాలలోనూ మానవ జీవితం దుఃఖమయం అన్న పరమసత్యం కళ్ళముందు స్పష్టంగా కనిపిస్తున్నా, ఆ దుఃఖాలను అధిగమించే మార్గం తెలియక అలమటిస్తూ గాలివాటు బ్రతుకును గడుపుతుంటాడు, మనిషి.

రాజకుమారుడైన గౌతమ బుద్ధుని యెటువంటి స్వల్పమయిన కష్టము కూడా తెలియకుండా సకల సౌఖ్యాలూ సమకూరుస్తూ యెంతో ప్రేమతో పెంచాడు,

అతడి తండ్రి శుద్ధోధన మహారాజు. గౌతమ బుద్ధుడు పెరిగి పెద్దవాడయిన తర్వాత ఒక రోజు మొట్టమొదటి సారిగా నగర పర్యటనకు బయలుదేరుతాడు. అలా కొంతదూరం వెళ్ళిన తర్వాత దారిలో ఒక రోగగ్రస్తుని, ఒక వృద్ధుడిని, ఒక శవాన్ని మొదటిసారిగా చూసి దిగ్భ్రాంతుడౌతాడు. మానవ శరీరము, జీవితము యింత దుర్భరంగా వుంటుందా అన్న వేదనతో అతని మనసు వికలమవుతుంది. కష్టాలు, దుఃఖము లేని స్థితికై అన్వేషణ ప్రారంభిస్తాడు. కఠిన సాధనలు చేసి చివరకు లక్ష్యం సాధిస్తాడు, అలా బ్రహ్మానుభూతిని పొందిన తర్వాత తాను పొందిన దుఃఖరహిత స్థితిని అందరూ పొందాలనే వుద్దేశంతో ఊరూరా తిరిగి ప్రజలకు మోక్షమార్గాన్ని బోధిస్తాడు. మహాత్ములందరూ మానవాళి సుఖ సంతోషాల కోసం ముక్తి మార్గ ప్రబోధం చేశారు.

బుద్ధ భగవానుని వలె శ్రీ భరద్వాజ మాస్టరుగారు కూడా తను అపారంగా ప్రేమించిన ఒక పసిబిడ్డ శాశ్వత వియోగంతో తల్లడిల్లిపోయారు. శాశ్వత దుఃఖ నివృత్తికై కృషి చేసి లక్ష్యం సాధించారు.

సాక్షత్తూ శ్రీ దత్తాత్రేయ భగవానుడే శ్రీ భరద్వాజ గురుదేవునిగా అవతరించారు. మానవ జీవితానికి అర్థము, పరమార్థము బ్రహ్మానుభూతిని పొందటమేనని చాటి చెప్పారు. శ్రీ సాయినాథుడు కూడా "మానవుడు దైవాన్ని తెలుసుకోవాలి. లేకుంటే యెందుకు వచ్చినట్లు? పిడకలేరుకోవటానికా?" అన్నారు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. 'మహాత్ములు దైవ స్వరూపులనీ, సాక్షత్తూ దైవమే మహాత్ములుగా, సద్గురువులుగా అవతరిస్తారనీ అంటారు కదా! అటువంటప్పుడు వారు కూడా సామాన్యుల వలె పరిస్థితులకు విచలితులవటం, దుఃఖించటము వుంటుందా? వారికి కూడా యిలా మనోవైకల్యాలు కలుగుతాయా' అనే సందేహం కొందరికి కలగవచ్చు.

**అయితే సద్గురువులు, మహాత్ములు అందరూ సాధారణ మానవుల వలె యీ భూమిపై అవతరిస్తారు. నిజంగా వారికి యెటువంటి మనోవైకల్యాలు వుండవు. నిరంతర ఆనంద స్థితిలో నిలచివుండే వారి ఆంతర్యం యీ పాంచ భౌతిక ప్రాపంచిక విషయాలకు చలించటం అనేదే వుండదు. ఒక తండ్రి తన పిల్లవానిని ఆడిస్తున్నపుడు తన పెద్దరికాన్ని ప్రక్కకు పెట్టి తానూ చిన్న పిల్లవానిలాగా నటిస్తూ, వాడితో మమేకమై వ్యవహరిస్తాడు. అలాగే మహాత్ములు మన మధ్య అవతరించి, సామాన్యుల వలె వ్యవహరిస్తూ మనతో మమేకమై అత్యంత ప్రేమతో మెలుగుతూ మనలను చేయిపట్టి నెమ్మదిగా మోక్షమార్గం వైపు నడిచేలాగ ప్రోత్సహిస్తారు. కనుక మన కోసం పాంచభౌతిక శరీరం ధరించి వచ్చిన ఆ భగవంతుని మనము సామాన్య మానవులుగా భ్రమించకూడదు.**

ఈ సందర్భంగా కొందరికి మరొక సందేహం కూడా కలుగవచ్చు. 'సామాన్యులకు అర్థం కాని ఆ బ్రహ్మానుభూతిని పొందటం వలన మానవుడు సద్గురువులు చెప్పినట్లు నిజంగానే దుఃఖరహిత స్థితిని పొందుతాడా' అని! ఈ సందేహానికి సమాధానంగా సద్గురువుల జీవితాలే ప్రత్యక్ష సాక్ష్యాలు. అంతేకాదు, దుఃఖ రహితులై, నిరంతర ఆత్మానందంలో తేలియాడుతూ, సర్వజ్ఞులై, నిత్యసంతృప్తులై, జ్ఞానబోధకులై సకల జీవులపై అంతులేని ప్రేమపూరిత హృదయులై మన మధ్య సంచరించే శ్రీ భరద్వాజ గురుదేవుల వంటి మహాత్ముల జీవన విధానమే మనకు ఆదర్శం. భూత, భవిష్యత్, వర్తమానాల నెరిగిన వారి సర్వజ్ఞత, ఆశ్రయించిన వారి ఆపదలు బాపుతూ యిహపర సుఖాలనందిస్తూ, యెల్లప్పుడూ కాచి రక్షించగల వారి సమర్థతలే యిందుకు నిదర్శనం. అంతులేని శాంతిని కలిగించే వారి సన్నిధియే మన జీవితాలకు మార్గ దీపిక.

**సమర్థుడైన నావికునిపై విశ్వాసముంచి, అతనిపై భారం మోపి యే విధంగానైతే మనము నావలో ప్రయాణిస్తామో, అదే విధంగా సద్గురువైన శ్రీ భరద్వాజ భగవానులపై విశ్వాసంతో వారి చరణ కమలాలను ఆశ్రయించి, మనమంతా వారు చెప్పిన మార్గంలో నడుద్దాం. దుఃఖరహిత స్థితి అయిన బ్రహ్మానుభూతిని సాధించేటందుకు కృషి చేయగల శక్తిని ప్రసాదించమని ప్రార్థిస్తూ వారికి మన శతకోటి ప్రణామాలను అర్పించి ధన్యులమవుదాము.**

జై సాయి మాస్టర్ !

# మాతృదేవి స్మృతులు

శ్రీ సురేష్, గుమ్మళంపాడు

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మతల్లి లీలావైభవాన్ని గుమ్మళంపాడు వాస్తవ్యులు శ్రీ సురేష్ గారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

నేను మొట్టమొదటిసారి 2021 సంవత్సరం జూన్ 5వ తేదీ మధ్యాహ్న సమయంలో పూజ్యశ్రీ అమ్మవారిని సమాధి చేసిన ప్రదేశానికి వచ్చాను. నిజానికి నేను 'అక్కడ ఎవరున్నారు? ఏం చేస్తున్నారు?' అన్న కుతూహలంతో చూడటానికి వచ్చాను. అంతకు ముందురోజు మా ఊర్లో, "ఎవరో గొప్పవారిని అక్కడకి తీసుకువచ్చారు!" అని చెప్పుకున్నారు. 'మన ఊరికి అంతటివారు వస్తే చూసిరావడం మన బాధ్యత!' అనిపించి ఆరోజు వచ్చాను. అక్కడ కొంతమంది ఎండలో పూజ్యశ్రీ అమ్మవారి సమాధిని పైదాకా మూసివేసే పనిలో వున్నారు. "ఎందుకండీ ఎండలో అంత శ్రమ పడతారు? ఏదైనా పరికరం వుపయోగించి చేస్తే తొందరగా అవుతుంది కదా!" అన్నాను. "అలా చెయ్యకూడదండి!" అని అప్పుడు పూజ్యశ్రీ అమ్మవారి గొప్పతనం చెప్పారు. నేను కూడా వాళ్ళతో పాటు కొంచెం ఇసుక వేశాను. మరి అదేం ఫలితమో కానీ అప్పటినుంచి ప్రతివారం వస్తున్నాను. అంటే ఆరోజు వెళ్ళిపోయి, ఒకవారం తరువాత వచ్చాను. మళ్ళీ సరిగ్గా వారం అయ్యేసరికి, "రాలేదేమిరా అబ్బాయ్?" , అన్నట్లు అనిపించి వెంటనే వచ్చేస్తాను. ఒకొక్కసారి వారానికి రెండు, మూడు సార్లు కూడా వస్తాను. సాధారణంగా ఎవ్వరూ లేనప్పుడువచ్చి పూజ్యశ్రీ అమ్మవారితో మాట్లాడుకుని వెళ్ళిపోతూవుంటాను. ఎందుకో నాకు బాగా జనం వున్నపుడు రావాలనిపించదు. నేను, పూజ్యశ్రీ అమ్మగారు.. ఇద్దరమే వుండాలనిపిస్తుంది. మీరందరూ పూజ్యశ్రీ అమ్మగారు అన్నా, నాకు మాత్రం అమ్మవారే!!

మాకు పొలాలు వున్నాయి. పూజ్యశ్రీ అమ్మవారు వచ్చిన సంవత్సరం 2021 లో జులై నెలలో నువ్వులు పంట వేసి, పూజ్యశ్రీ అమ్మవారికి, "అమ్మా! ఈ ప్రాంతంలో కొంతకాలంగా సరైన వర్షాలు లేక పంటలు బాగా పండటం లేదు. మీ దయవల్ల నువ్వుల పంట బాగా పండాలమ్మా!" అని చెప్పి మొక్కుకున్నాను. చిత్రంగా వర్షాలు బాగా పడి, ముప్పై వేలు పెట్టుబడి పెడితే, ముప్పై ఐదు వేలు వచ్చింది! తరవాత మినుములు వేశాను. పూజ్యశ్రీ అమ్మవారు రాక ముందు లక్షన్నర పెట్టుబడి పెడితే మళ్ళీ అంతే వచ్చింది. అంటే అసలే కానీ లాభం రాలేదు. ఈసారి పూజ్యశ్రీ అమ్మవారికి మొక్కుకుని, లక్షా పదివేలు పెట్టుబడి పెట్టి మినుములు వేశాను. అద్భుతంగా రెండులక్షల ఇరవై వేలు వచ్చింది! సరిగ్గా రెట్టింపు ఆదాయం! ఇక నా ఆనందానికి అవధులు లేవు.

2022 సంవత్సరం జులైలో మళ్ళీ నువ్వుల పంట వేసి, పూజ్యశ్రీ అమ్మవారికి మొక్కుకోకుండావుంటే ఏమౌతుందో చూద్దామని, పూజ్యశ్రీ అమ్మవారి

దగ్గరికి వచ్చి ప్రత్యేకంగా మొక్కుకోకుండా పంట వేశాను. ఒక్కసారి కూడా వర్షం రాలేదు! పంట ఎండిపోయేటట్లున్నది. ఇక లాభం లేదని, పూజ్యశ్రీ అమ్మవారి సన్నిధికి వచ్చి, "అమ్మా! మీరు కాపాడి తీరాలమ్మా, లేకపోతే చాలా నష్టమొచ్చేటట్లువుంది!" అని మొరపెట్టుకున్నాను. కొద్దిరోజులకే బ్రహ్మాండమైన వానలు పడి పంట బాగా పండింది. ముప్పై ఐదు వేలు పెట్టి పంట వేస్తే, లక్షా ముప్పైయేడు వేలు ఆదాయం వచ్చింది. ఇంకా ఇంతకన్నా నిదర్శనం ఏముంటుంది?

మా అబ్బాయి ఒంగోలులో మాంటిస్సోరి స్కూల్ లో పదవ తరగతి చదువుతున్నాడు. అక్కడే వసతి గృహంలో (హాస్టల్) చేర్చాను. కానీ అక్కడ కొంచెం ఇబ్బందిగా వుండటం వల్ల దగ్గరలో ఇల్లు చూద్దామని ప్రయత్నం చేస్తున్నాను. ఎక్కడా సరైన ఇల్లు దొరకడం లేదు. అదే మనసులో అనుకుంటూ పక్కకి చూసేసరికి, అక్కడ పూజ్యశ్రీ అమ్మవారు, పూజ్యశ్రీ మాస్టరుగారు వున్న పటం కనిపించింది. చాలా ఆనందం వేసింది. మనసులోనే నమస్కారం చేసుకుని విషయం చెప్పేసుకున్నాను. వెంటనే ఆ పక్కనే ఒక ఇల్లు దొరికింది. అంతసేపు వెతికినా దొరకనిది, పూజ్యశ్రీ అమ్మవారు కనపడిన వెంటనే దొరకడం ఎంత ఆశ్చర్యం?! తరవాత తెలిసింది ఆ పటం వున్నది మన ట్రస్ట్ భవనం అని. ఇంతవరకు నాకు పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి గురించి తెలియదు. పూజ్యశ్రీ అమ్మవారు పరిచయం అయ్యాక వారి గురించి తెలిసింది.

2022 సంవత్సరం మే నెలలో అనుకోకుండా తిథి ప్రకారం ఆరాధన రోజున వచ్చాను. అక్కడ శ్రీ ద్వారక బాబుగారిని కలిసి మాట్లాడాను. అయితే జూన్ 3, 4, 5 తేదీలు పూజ్యశ్రీ అమ్మవారి ఆరాధన ఉత్సవాలని 2 వ తేదీ తెలిసింది. 3 వ తేదీ మా అబ్బాయి పంచ కట్టించే కార్యక్రమం పెట్టుకున్నాము. అది ఎప్పుడో ముందే నిర్ణయించబడింది. దానిని ఆపలేము. ఆరోజు రాత్రి చాలా బాధపడ్డాను. "ముందే తెలిసుంటే ఈ కార్యక్రమం పెట్టుకునే వాడినే కాదు, ఇంత దగ్గరలో వుండి కూడా ఈరోజు వెళ్లలేక పోయాను" అని బాధపడి ఆ రాత్రంతా నిద్రపోలేదు.

3వ తేదీ, 4వ తేదీ గడిచిపోయాక, 5వ తేదీ సాయంత్రం పొలంలోకి వచ్చేసరికి వేదమంత్రాల ఘోష అక్కడకు వినిపిస్తోంది! వినపడటం కాదు ఆ ప్రాంతమంతా మారుమ్రోగిపోతోంది!! అది వినేసరికి కళ్ళవెంట బొటబొటా నీళ్లు కారుతూంటే వేగంగా పూజ్యశ్రీ అమ్మవారి సన్నిధికి వచ్చి ఎన్నో సంవత్సరాలుగా తల్లిని చూడని పిల్లవాడిలా కన్నీళ్లు కారుస్తూ వారిని తనివితీరా చూసుకున్నాను. అలా ఒక గంటసేపు అక్కడే కూర్చున్నాను. నేను ఎప్పుడు అక్కడకి వచ్చి కూర్చున్నా, ఆ పటంలో మాత్రమే కాదు, ఆ చుట్టూవున్న చెట్లు, పొలాలూ అన్ని పూజ్యశ్రీ అమ్మవారే అనిపిస్తుంది! ఎటువైపు చూసినా పూజ్యశ్రీ అమ్మవారే కనపడి మనసు పులకరిస్తుంది.

వాస్తవానికి నాకు బాబాగారంటే ఇష్టము, నమ్మకము రెండూ లేవు. రాముడు, శివుడు, కృష్ణుడు.. వీళ్ళని మాత్రమే పూజిస్తాను. పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారంటే అస్సలు తెలియదు. కానీ ఈ అమ్మవారంటే నాకెందుకింత ప్రేమో అర్థం కావటం లేదు. ఒక్కసారి పూజ్యశ్రీ అమ్మవారికి మనస్ఫూర్తిగా నమస్కరిస్తే, ఇక వారి ప్రేమను తట్టుకోవడం మనవల్ల కాదు. సన్నిధికి వచ్చి పూజ్యశ్రీ అమ్మవారి పటానికి నమస్కారం చేసిన వెంటనే, నవ్వుతూ పలకరిస్తున్నట్లు వుంటుంది. వెంటనే ఎంతో ఆనందం వస్తుంది. 'నా కోసమే పూజ్యశ్రీ అమ్మవారు ఇక్కడకి వచ్చారా!' అనిపిస్తుంది. ఇంతటి ప్రేమని పంచి ఇచ్చే పూజ్యశ్రీ అమ్మవారు దొరకడం నా అదృష్టంగా భావిస్తూ, ఈ ప్రేమని, ఆనందాన్ని ఎప్పుడూ పొందేలా అనుగ్రహించమని పూజ్యశ్రీ అమ్మవారి పాదపద్మములకు నమస్కరిస్తున్నాను.●

# శ్రీ గురుచరిత్ర సప్తాహ సత్సంగ ప్రవచన యాత్ర (శ్రీ క్షేత గాణ్గాపురం)

*శ్రీమతి టి. పద్మావతి*

**(ఆధ్యాత్మిక వైభవానికి నిలయమైన పవిత్రమైన భీమ-అమరజా నదుల సంగమతీరంలో సాక్షాత్తు దత్తావతారమైన శ్రీ నృసింహ సరస్వతిస్వామివారు సుదీర్ఘకాలం నివసించి నేటికీ నిర్గుణ పాదుకల రూపంలో విరాజమానులైవున్న శ్రీ క్షేత్ర గాణ్గాపుర యాత్రలో గురుపుత్రిక శ్రీమతి వేదమ్మగారు, శ్రీశ్రీకాంత్‌గార్లు వారి కుమారులు చిరంజీవి తీర్థ చరణ్ మరియు కుమార్తె చిరంజీవి కైవల్య లతో సకుటుంబంగా పాల్గొని గత సంవత్సరం నవంబరు 26వ తేదీ నుండి డిసెంబరు 2వ తేదీ వరకు శ్రీ గురుచరిత్ర సప్తాహ ప్రవచనం చేశారు. మన సాయిబాబా పత్రిక పాఠకుల కోసం హృద్యంగా అందించబడిన యీ అద్భుతమైన యాత్రా విశేషాలను యీ సంచిక నుండి మీ ముందుంచుతున్నాం! - ఎడిటర్.)**

## శుభసంకల్పము

గాణ్గాపుర సప్తాహ ప్రవచన యాత్ర, దైవ ప్రేరితమై, అత్యంత మహిమాన్వితంగా శుభారంభమైంది. ఒక శుభముహూర్తంలో, గురుబంధువైన శ్రీ గుత్తి శ్రీనివాస్‌గారు గురుపుత్రిక శ్రీమతి వేదమ్మగారికి ఒక ఆనందదాయకమైన సందేశాన్ని అందించారు. గాణ్గాపురక్షేత్రాన వెలసిన శ్రీగురుని సేవలో తరిస్తున్న భాస్కరశర్మగారి వంశీకులు, పూజ్యులు శ్రీ ప్రసన్న పూజారిగారికి సం॥2025 లో ఒక వారం రోజుల పాటు శ్రీగురుడికి 'భిక్ష' సమర్పించుకునే మహద్భాగ్యం లభించింది. ఆ భాగ్యంలో భాగంగా, వారు అత్యంత ప్రీతితో శ్రీ శ్రీకాంత్‌గారు మరియు శ్రీమతి వేదమ్మగారిని ఆహ్వానిస్తూ, గాణ్గాపురం విచ్చేసి శ్రీగురుడికి భిక్ష సమర్పించుకోవాలని కోరారు.

ఈ ఆహ్వానాన్ని చర్చించుకుంటున్న తరుణంలో, శ్రీమతి వేదమ్మగారు కనీసం మూడురోజుల పాటు



ఆ క్షేత్రంలో స్వామి సేవలో ఉండాలని భావించారు. అప్పుడు శ్రీ గుత్తి శ్రీనివాస్‌గారి మనసులో ఒక ఉన్నతమైన, లోకకళ్యాణకారకమైన ఆలోచన మెరిసింది. "భక్తులందరినీ ఆహ్వానించి అక్కడ ఒక 'సప్తాహ ప్రవచనం' ఏర్పాటు చేస్తే, అందరికీ ఆ పుణ్యక్షేత్రంలో వారం రోజుల పాటు ఆధ్యాత్మికంగా గడిపే భాగ్యం కలుగుతుంది కదా!" అని వారు సంకల్పించారు. ఆ మాటే ఒక మహత్తర ఆధ్యాత్మిక కార్యానికి రూపకల్పన చేసింది.

అయితే, ఈ దివ్య సభకు వేదిక ఎక్కడ అన్న ప్రశ్న తలెత్తినప్పుడు, పూజ్యశ్రీ మాస్టరుగారి దివ్య ఆశీస్సులతో, శ్రీగురుని అపార కరుణతో ఒక అద్భుతం సాక్షాత్కరించింది. సాధారణంగా మఠం లోపల సత్సంగాలు, ప్రవచనాలు నిర్వహించుకోడానికి అనుమతించరు. కానీ, చరిత్రలో మొట్టమొదటిసారిగా, సాక్షాత్తూ స్వామివారి మఠం లోపలే సత్సంగ ప్రవచనాలు నిర్వహించుకునే అరుదైన అవకాశం శ్రీమతి వేదమ్మగారికి లభించింది. ఇది ఆ దత్తాత్రేయస్వామి అనుగ్రహమే!!

## యాత్రా సన్నాహాలు

ఈ మంగళకరమైన వార్త తెలియగానే సత్సంగసభ్యుల హృదయాలన్నీ ఆనంద తరంగాలతో ఉప్పొంగిపోయాయి. శ్రీగురుని పిలుపునందుకొని భక్తులందరూ అత్యంత ఉత్సాహంతో ఆ పుణ్యక్షేత్రానికి బయలుదేరారు.

ప్రవచన కార్యక్రమానికి వచ్చే భక్తుల వసతి ఏర్పాట్లకు నవంబర్ 18 నుంచే కొందరు భక్తులు గాణ్గాపురం చేరి అన్ని ఏర్పాట్లు చేశారు. మఠాన్ని శుభ్రపరిచారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రవచనం జరిగే మంటపాన్ని ఎంతో కష్టపడి శుభ్రం చేసి గోడలకు రంగులు వేసి వేదికపై శ్రీ గురుని వర్ణ చిత్రాన్ని స్థానిక కళాకారుని చేత వేయించారు. ఆ మంటపాన్ని అత్యంత శోభాయమానంగా తీర్చిదిద్దారు. భక్తులకు యాత్రీనివాస్ లో గదులు కేటాయించబడ్డాయి. చాలాకాలం నుంచి వాడకపోవటం వల్ల అత్యంత అపరిశుభ్రంగా ఉన్నటువంటి ఆ భవనాన్ని భక్తులు మరుగుదొడ్లతో సహా శుభ్రపరిచారు. వారి సేవానిరతిని చూసి గాణ్గాపుర వాసులు సైతం ఆశ్చర్యానందాలకు లోనయ్యారు. శ్రీ సాయి మాస్టర్ భక్తులంటే ఆ గాణ్గాపుర వాసులకు ప్రత్యేకమైన గౌరవం కలిగింది. వారు కూడా ఈ కార్యక్రమానికి ఎంతో సహాయసహకారాలు అందించారు.

అంత తక్కువ సమయంలో, అంతమంది భక్తులకు అవసరమైన వసతి మరియు భోజన సదుపాయాలను అత్యంత చక్కగా ఏర్పాటు చేయడం వెనుక మన కమిటీ సభ్యుల కృషి, శ్రీ గురుని అదృశ్య హస్తం ఉన్నాయనటంలో సందేహం లేదు. ఆ విధంగా, నవంబర్ 26వ తేదీ నుండి డిసెంబర్ 2వ తేదీ వరకు శ్రీమతి వేదమ్మగారి ముఖతః శ్రీ గురుచరిత్ర సప్తాహ ప్రవచన కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది.

## మహాత్ముల ఆశీస్సులు

కొందరు సత్సంగసభ్యులతో కలిసి శ్రీమతి వేదమ్మగారు ఒంగోలులో పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారి దివ్యధామాలను సందర్శించి ఆశీస్సులందుకుని ప్రయాణమై తొలుత హైదరాబాద్ చేరుకున్నారు. నవంబర్ 24వ తేదీన అక్కడినుండి మాణిక్యప్రభువుల ఆశీస్సులు కూడా పొంది, శ్రీగురుని సన్నిధికి వెళ్లాలన్న సత్సంకల్పంతో వేదమ్మగారితో కలిసి మరి కొందరు భక్తులము మాణిక్యనగర్ పుణ్యధామానికి చేరుకున్నాము. అప్పటికే ఆ క్షేత్రమంతా దత్తజయంతి మహోత్సవ సన్నాహకాంతితో వెలిగిపోతోంది. ఆ వేడుకలు చాలా వైభవంగా నిర్వహిస్తారు. మేమందరమూ వేదమ్మగారితో కలిసి పరమపవిత్రమైన మాణిక్యప్రభువుల సమాధిని దర్శించుకున్నాము.

భక్తులందరము పరమపావనమైన మనోహర్ మాణిక్య ప్రభువుల సమాధి దర్శనార్థం వెళ్లాము. అక్కడ నాలుగైదు మెట్లు దిగి, ఒక చిన్న గవాక్షం (కిటికీ) గుండా మాత్రమే ఆ దివ్యసమాధిని దర్శించుకోవాలి. అది అక్కడి నియమం. అందరమూ అలాగే దర్శించుకుని తన్మయత్వంలో వుండగా, వేదమ్మగారి పుత్రిక చిరంజీవి కైవల్య హృదయంలో ఒక నిష్కల్మషమైన కోరిక

మొలకెత్తింది. ఆ చిన్నారి ఎంతో ఆర్తితో— "అమ్మా! లోపలికి వెళ్లి ప్రభువును దర్శించుకోవాలని ఉంది, నాకు వెళ్లాలనిపిస్తోంది" అని చెప్పింది. దానికి వేదమ్మగారు "అమ్మా! క్షేత్ర ఆచారం ప్రకారం అందరూ ఈ కిటికీ నుండే దర్శించుకోవాలమ్మా, లోపలికి వెళ్లడం వీలుపడదు" అని నచ్చజెప్పారు.

అప్పుడే ఊహించనలవికాని అద్భుతమైన లీల జరిగింది. అక్కడకు ఒక వ్యక్తి వచ్చి, అత్యంత వాత్సల్యంతో, "పైకి వచ్చి నమస్కరించుకుంటారా?" అని ఆహ్వానించాడు!! భక్తుల ఆశ్చర్యానికి అవధులు లేవు. ఆ మాణిక్యప్రభు లీలకు పరవశిస్తూ ఆయన వెనుకే అందరమూ వెళ్లాము. అక్కడ ప్రభువులవారు అధిష్టించిన దివ్య ఆసనాన్ని, పక్కనే వున్న పరమపవిత్రమైన ప్రభువు వాడిన దండాలను దర్శించుకుని పులకించిపోయాము. అంతటితో ఆగక, ఆ వ్యక్తి మరల హిందీలో— "మీరు భూగర్భంలో వున్న మనోహర్ మాణిక్య ప్రభువుల సమాధిని కూడా సమీపం నుండి దర్శించుకుంటారా?" అని ప్రశ్నించారు.

ఆ మాట వినగానే మాకు నోటమాట రాలేదు. మా హృదయాలు భక్తిపారవశ్యంతో ఉప్పొంగిపోయాయి. మేము ఆ దివ్యానుభూతిలో వుండగానే, ఆయనే స్వయంగా భూగర్భ గృహ ద్వారాలు తెరిచారు. కైవల్య మనసులోని చిన్న కోరికను సాక్షాత్తూ ఆ ప్రభువులే ఆలకించి, సామాన్యులకు అలవిగాని ఆ దివ్య సమాధి సామీప్యాన్ని మాకందరికీ ప్రసాదించారు. ఇదంతా శ్రీ మాణిక్య ప్రభు అనుగ్రహమే!!!

అక్కడినుండి వెలుపలకు రాగానే, ప్రభువుల కాలం నాటి వందలాది దివ్య దండాలు ఎండలో మెరుస్తూ భక్తులకు సాక్షాత్కరించాయి. ప్రతి సంవత్సరం దత్తజయంతి ఉత్సవాలముందు వాటిని గదిలోంచి బయటికి తీసి మెరుగు పెట్టి, ఆరబెడతారు. ఆ ఉత్సవానికి వచ్చిన వాళ్లందరికీ తాకి నమస్కరించుకునే అవకాశం ఇస్తారట. స్వాతంత్ర్య సమరయోధుల రక్షణార్థం ప్రభువుల వారు స్వయంగా సిద్ధం చేయించి ప్రసాదించిన ఆ దండాలను భక్తితో తనివితీరా స్పృశించి నమస్కరించాము. తరువాత ఇతర ప్రభువుల వంశీకుల సమాధులను, పరమ భక్తురాలు వెంకమ్మ సమాధిని దర్శించుకున్నాము. మాణిక్య ప్రభు ఆలయ ప్రాకారమంతా వారి పవిత్రచరిత్రను బొమ్మలతో లిఖిత పూర్వకంగా తీర్చిదిద్దారు. ఆ ప్రభువుల చరిత్రను కైవల్యకు వివరిస్తూ అందరమూ ఆలయ ప్రదక్షిణ చేసుకున్నాము.

అనంతరం మేమంతా ప్రభువుల సన్నిధిలో కూర్చుని, దత్త నామస్మరణతో భజనలు చేస్తూ కొంతసేపు ఆధ్యాత్మిక పారవశ్యంలో మునిగిపోయాము. ప్రస్తుత పీఠాధిపతులు శ్రీ జ్ఞానరాజ్ మాణిక్యప్రభు మహరాజ్ వారిని దర్శించి, వారి దివ్యాశీస్సులు అందుకున్నాము. వారు గురుపుత్రిక వేదమ్మగారితో పూజ్యశ్రీ మాస్టరుగారు మరియు అమ్మగారి గురించి ఎంతో ఆత్మీయంగా ప్రస్తావించి అందరినీ దీవించారు.

సంస్థానంలో లభించిన మధ్యాహ్న మహాప్రసాదాన్ని స్వీకరించిన వేదమ్మగారికి, భక్తులందరి తరపున అక్కడ భిక్ష సమర్పించాలన్న తలంపు కలిగింది. దత్త జయంతి మరుసటి రోజున జరిగే 'దర్బార్' సాయంత్రం అత్యంత మహిమాన్వితమైనదని, ఆ రోజున చేసే భిక్షా సేవ అత్యంత ఫలప్రదమని తెలుసుకున్న వేదమ్మగారు, భక్తులందరి తరపున అక్కడ రుసుము చెల్లించి, డిసెంబరు ఐదో తేదీ భిక్ష జరిగేటట్లు ఏర్పాటు చేశారు.

మాణిక్యనగర్ లో ఆ ఆధ్యాత్మిక అనుభూతులను పొందిన అనంతరం, భక్తబృందమంతా ప్రసిద్ధమైన 'చల్లా' అనే పవిత్ర ప్రాంతానికి చేరుకున్నాము.. ఎత్తైన ప్రదేశంలో, ప్రకృతి ఒడిలో అత్యంత ప్రశాంతంగా వున్న ఆ క్షేత్రం మనసును ఆధ్యాత్మిక అలౌకికానందంలో ముంచెత్తింది. సాక్షాత్తూ మాణిక్య ప్రభువులవారు ఒక ముస్లిం భక్తునిపై కరుణతో, తమ 'దివ్య టోపీని మరియు సటకాను' కానుకగా ప్రసాదించారు. అవి నేటికీ అక్కడ అత్యంత భక్తితో నిక్షిప్తం చేయబడ్డాయి. ఆ పవిత్ర స్థలంలో కొంతసేపు మౌనంగా గడిపిన భక్తులకు, మతాతీతమైన ఆ దత్తప్రభువుల విశాల హృదయం స్ఫురణకు వచ్చింది.

**- సశేషం**

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 16వ ప్రసంగము

### అసత్కార్య పరిగ్రహః

శాస్త్ర మర్యాదలను పాటించకుండా నిషిద్ధకర్మలను ఆచరించడం. అంటే అన్యాయంగా ధనాన్ని సంపాదించడం, దంభము, దర్పము, అభిమానాన్ని ప్రకటించే చేయకూడని పనులు చేయడం, దయలేకుండా ఇతరులను బాధించడం ఇవన్నీ అసత్కార్య పరిగ్రహంలో చేరతాయి.

ధర్మము, అర్థము, కామము, మోక్షము ఈ నాలుగూ సత్కార్యాలు. వాటికోసం చేసే ప్రయత్నాలు కూడా సత్కార్యాలే. యజ్ఞయాగాది పుణ్యకర్మలు, న్యాయంగా ధనాన్ని సంపాదించడం, సాత్విక సంపద లభించడం తోటే కోర్కెలను, జగత్తును మిథ్యగా భావించి జీవుడు బ్రహ్మము యొక్క ఐక్యములోనే లాభం వుందని తలచడం సత్కార్యాలు. వీటికి విపర్యాలు అసత్కార్యాలు.

యజ్ఞము మొ॥న వాటిని కూడా లోకంలో గౌరవం కోసం చేయడంలో విధ్యనుష్ఠానము సిద్ధించదు. అవి అసత్కార్యాలు. అన్యాయంగా ధనాన్ని సంపాదించి తద్వారా అనేకరకాలైన అనర్థాలను పొందడం కూడా అసత్కార్యమే. ఇతరులకు ద్రోహం చేసి, మోసగించి, ధనాన్ని సంపాదించి మానసికములైన వాసనలను పోషించడం అసత్కార్యము. గురువు దగ్గరకు జ్ఞానం వినడానికి వెళ్ళి, ఆ జ్ఞానాన్ని అక్కడే విడిచిపెట్టి వచ్చేవాడు కూడా అసత్కార్యాన్నే చేస్తున్నాడు. ఇటువంటి వారి నందరినీ 'అసత్కార్య పరిగ్రహులు' అనవచ్చు.

ఈ దృష్టాంతాన్ని ఈ విషయంలో వినండి–

ఒక అసత్కార్యపరిగ్రహం కల వర్తకుడు తన కుమారునితో ఒక మహాపురుషుడు చేసే హరికథా కాలక్షేపానికి వెళుతుండేవాడు. ఒకరోజున ప్రసంగవశాత్తూ ఆయనిలా అన్నారు – "ఆవు మేస్తున్నప్పుడు అదిలించకూడదు, అందువలన పాపమొస్తుంది". వర్తకుడు, అతని కుమారుడు అది విని ఇంటికి వచ్చారు. అతనిది కిరాణా కొట్టు. ఎన్నో ధాన్యాలు బయట వుండేవి. ఒకరోజు వర్తకుడు బయటకెక్కడికో వెళ్ళాడు. అతని కుమారుడు ఆ దుకాణంలో కూర్చుని

వున్నాడు. అపుడు ఒక ఆవు వచ్చి గింజలను తినడం మొదలుపెట్టింది. కుమారుడికి కథలో వినిన విషయం గుర్తొచ్చి ఆవును తోలలేదు. అక్కడ వున్న గింజలను తిని ఆవు వెళ్ళిపోయింది. అప్పుడు వర్తకుడు వచ్చి కిందపడివున్న గింజలను చూసి ఇదేమిటని అడిగాడు. కుమారుడు కథలోని విషయాన్ని గుర్తుచేశాడు. తండ్రి కోపంతో ఇలా అన్నాడు – "మూర్ఖుడా! నీకు ఇంతసేపూ కథలోని విషయం గుర్తుందా? కథ వినిన తరువాత బట్టలు దులిపేసుకుని, ఆ సంగతులు అక్కడే విడిచి రావాలి. అంతేగాని మనసులో ఏమాత్రం వుంచుకోకూడదు. గురువుగారి పాదాలమీద పడి వస్తే చాలు. నాకు 70 సం॥ల వయస్సు. 15 సం॥ల నుండి హరికథలు వింటున్నాను. అయినా వినిన కథను గురువుగారి దగ్గరే విడిచి వచ్చేస్తున్నాను. అందరూ నాలాగే చేస్తారు. నీలాగా నేను చేసివుంటే ఇంట్లో డబ్బే లేకుండా పోయేది! బిచ్చమెత్తుకుని తినవలసి వచ్చేది. ఇప్పటినుండి నీవు ఎప్పుడూ వినిన కథను మనసులో వుంచుకోకు. లేకపోతే బాధపడాల్సి వస్తుంది".

ఇలా అసత్కార్యపరిగ్రహులైన మానవులు ప్రజల దృష్టిలో సత్కార్యాలు చేస్తున్నట్లు నటిస్తారు. కానీ నిజానికి వారు చేసేవన్నీ అసత్కార్యాలే. అసత్కార్యాలు చేసేవారికి ఆత్మసుఖం గాని, లౌకికమైన సాత్విక సుఖంగాని కలుగదు. కాబట్టి దానిని ముముక్షువులు త్యజించాలి.

## విషయోపసేవా చాజస్రమ్

ఎల్లప్పుడు విషయభోగాలలో నిమగ్నమై వుండడం కూడా రజోగుణ లక్షణము. శబ్దము, స్పర్శ, రూపము, రసము (రుచి), గంధము (వాసన) – ఈ ఐదు విషయాలు శరీర నిర్వహణ కోసం అనుభవించాలి. విషయభోగం చేత మనస్సు తృప్తి చెందదు. భోగము ద్వారా తృప్తి కలగనంత వరకూ విషయాలను త్యజించడం సాధ్యంకాదు. అగ్నిలో నెయ్యి వేస్తే అగ్ని ఆరదు. పైగా ప్రతిజ్వలిస్తుంది. అలాగే అధికంగా విషయాలను అనుభవించడం వలన విషయానుభవంలో కోరిక పెరిగిపోతుంది. కానీ తృప్తి కలుగదు. ఒక్కొక్క విషయంలోని కోరిక వలననే కోడి, ఏనుగు, మిడుత, చేప, తేనెటీగ నశిస్తాయి. ఇక ఐదు విషయాలలో ఆసక్తి కలిగివుండే మానవుడికి ఏ గతి కలుగుతుంది? భక్తుడైన ప్రహ్లాదునికి రాజ్యసింహాసనం స్వీకరించే సమయం దగ్గరపడుతున్న కొద్దీ దానిలోని దోషాన్ని గమనించినందువలన స్వీకరించలేదు. 'ఓ భగవంతుడా! నాలుక మొ॥న ఇంద్రియాలు మానవుడిని ఇంద్రియార్థాల వైపుకు ఆకర్షించి ప్రపంచంలో ముంచివేస్తాయి. విషం కలిసిన మిఠాయి తినేటప్పుడు మొదట్లో తీయగా వున్నప్పటికీ కడుపులోకి వెళ్ళగానే ప్రేగులను తినేస్తుంది.

'మన ఆహారము మొ॥న వాటిలో రజోగుణ ప్రవృత్తిని పెంచుకుంటూ దానితో పాటు విషయ వాసనను నిర్మూలించి జ్ఞానాన్ని పొందడానికి ప్రయత్నించాలి' అనేది విపరీతమైన ఆలోచన. రాజసిక వ్యవహారాన్ని వదలనిదే జ్ఞానాన్ని పొందడానికి చేసే ప్రయత్నాలు సఫలం కావు.

నిత్యానందస్వామి ఇలా అన్నారు–

ఆలోచించి చూస్తే విషయాలు మొ॥నవన్నీ చిన్న పురుగు నుంచి బ్రహ్మ దాకా సమానంగానే వుంటాయి. ఒక ప్రాణికి, మరొక ప్రాణికి కొద్దో గొప్పో తేడా వుంటుంది. కాని ఏ ప్రాణికి తగినంతగా కలిగే విషయసుఖము సమానంగానే వుంటుందని ఆలోచిస్తే తెలిసిపోతుంది. ఆత్మపురాణంలో దృధ్యజ్ ఋషి ఇంద్రునికి కుక్కకూ సమానమైన విషయవాంఛలు కలుగుతాయని చెబుతూ ఇలా అన్నాడు–

"ఓ ఇంద్రా! అజ్ఞానము వలన కలిగిన దేహాభిమానం విషయంలో నీకు, కుక్కకు వున్న ఐశ్వర్యములు సమానమే. రకరకాల ఐశ్వర్యాలలో, దివ్యశరీరంలో స్వర్గంలోని అప్సరసల పట్ల నీకు ఎటువంటి ఆసక్తి కలుగుతుందో అలానే కుక్కకు కూడా తన ఐశ్వర్యము పట్ల ఆసక్తి కలుగుతుంది. అమృతంపట్ల దేవతలకు కలిగే ప్రేమే క్రక్కిన కూటి పట్ల కుక్కకు కలుగుతుంది. మా శరీరాల కంటే నీ శరీరము సున్నితమైనది. అలాగే



పందులు మొ॥న జీవుల కంటే కుక్క శరీరము కూడా కోమలమైనది. నీ శరీరము మీద ఇంద్రాణి, అప్సరసలు ప్రేమ చూపినట్లే కుక్క శరీరము మీద ఆడకుక్కలు ప్రేమను చూపిస్తాయి. నీకు అపకారము చేసినవారి పట్ల నీకు కోపం వచ్చినట్లుగానే కుక్క కూడా తనకు అపకారం చేసినవాడి పట్ల కోపం చూపిస్తుంది. ఇలా మీ ఇద్దరికీ సమానత్వం వున్నది".

స్వా॥ప్ర॥ : ముస్లిం మహాత్ముల చరిత్రలలో ఒకచోట ఒక మహాపురుషుడిలా వ్రాశాడు. "నేను స్వప్నంలో మానవులందరూ గాడిదలతో కలిసి గడ్డి తింటుండడం చూశాను".

ఇది విని ఒకాయన అతనిని ప్రశ్నించాడు. "మహాత్మా! అందరు మనుషులు గాడిదలతో కూర్చుని గడ్డి తింటుండడం చూస్తున్నప్పుడు మీరు ఏమి చేస్తున్నారు?" మహాపురుషుడిలా అన్నారు, "నేను కూడా వారితోనే వున్నాను. కానీ కొంచెం తేడా వుంది. అందరూ గడ్డి తింటూ ఆనందపడుతూ వున్నారు (అంటే భోగాలను అనుభవిస్తూ వున్నారు). కానీ నేను మాత్రము ఒకచోట ఆలోచిస్తూ కూర్చుని వున్నాను".

యోగవాశిష్ఠంలో కూడా ఇలా వున్నది–

**శ్లో॥ జ్ఞాత్వా ప్రత్యన్త వైరస్యం**
**యః పదార్థేషు మూఢధీః ।**
**బధ్నాతి భావనాం భూయో**
**నరో సాసౌ స గర్దభః ॥**

భావం: మూఢుడు వస్తువులు సారములేనివి అని తెలిసివుండి కూడా పదార్థాల పట్ల మోహములో బద్ధుడవుతాడు. అటువంటివాడు గాడిద.

ఇలా శాస్త్రకారులు మానవుడ్ని కుక్కతోటి, గాడిదతోటి పోల్చినా నాకు సిగ్గు కలుగదు.

ఇది విని శ్రీ నిత్యానంద స్వామివారు ఆనందబాష్పాలు కార్చారు.

**- సశేషం**

## పరిప్రశ్న

06వ పేజీ తరువాయి

ప్రయత్నాన్ని, కేవల అంతర్ముఖత్వాన్ని చూచి అట్టి శుద్ధిని సాధించని మనమూ అనుకరించ ప్రయత్నిస్తే ఒకవంక మనం సాధనలో పురోగమించలేము, మరొకవంక సమాజం నైతికంగా దిగజారడానికి మన నిష్క్రియత్వం కారణమై మనపట్ల దోషంగా పరిణమిస్తుంది. 'ధర్మాన్ని రక్షించినవారిని ధర్మం రక్షిస్తుంది' అన్న ఆర్యోక్తికర్థమిదే.

అధర్మము పెరుగుతుంటే పట్టనట్లు వూరుకున్నవారు గూడా అధర్మం చేసినవారే అవుతారని ధర్మసూత్రం. పతనావస్థలో నున్న సమాజంలో యిట్టి శుభయత్నం ఆరంభంలో కష్టతరమే. కాని ప్రాణాపాయ స్థితిలోనున్న సోదరునికి సేవ చేయడం కష్టతరమని అతనిని మరణించనిస్తామా? ఎంతటి కష్టాన్నైనా ఓర్చి బ్రతికించుకుంటాముగదా? అలానే ధర్మం విషయంలోనూ.●

(గత సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

*శ్రీమతి శ్రీదేవి*

## అధ్యాయం - 7

**3. చీరాల అవధూత స్వామి :** భరద్వాజగారు జిల్లెళ్ళమూడి ఆశ్రమంలో వుంటున్న రోజులలో ఒకసారి ఆయనకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. ఆయన చీరాలలోని డా॥ శ్రీధరరావుగారి హాస్పిటల్లో చేరి ట్రీట్మెంట్ తీసుకొంటున్నారు. ఆ సమయంలో చీరాలలోని అవధూత గురించి విని ఆయనను దర్శించారు శ్రీ భరద్వాజగారు. ఆ స్వామి జడలు కట్టిన జుట్టు, గడ్డము, మాసిన చిరిగిన బట్టలు, బోదకాలుతో పిచ్చివానివలె వున్నారు. నిస్సంగులైన అవధూతలకు దేహంపైగాని, వస్త్రాలపై గాని అపేక్ష వుండదు. కండ్లు పుసిగట్టి నీరు గారుతున్నా, దేహము, గుడ్డలు మురికిపట్టి వున్నా శ్రీ స్వామి పట్టించుకునే వారుకాదు.

తమకు భిక్షనివ్వాలని తాపత్రయపడేవారిని పట్టించుకోకుండా స్వామి తమకు బుద్ధి పుట్టినప్పుడు నడిబజారులో కూర్చుని తోచిన భక్తుడిని పిలిచి భోజనం తెమ్మనే వారు. కుక్కలు విస్తట్లో మూతిపెట్టి తింటున్నా, కలుపుతున్న అన్నంలో రోడ్డు మట్టి కలుస్తున్నా నిర్లిప్తులై యుండేవారు. ఆకలి తీరాక చేయి కడుక్కునేవారు గాదు. కుక్కలు వచ్చి వారి గడ్డానికి, మీసానికి అంటిన మెతుకులు తిని, చేతికున్న ఎంగిలి నాకినా ఆయనకేమీ పట్టేది కాదు. స్వామి మురికి గుంటల్లోని నీరు త్రాగి దాహం తీర్చుకునేవారు.

ఆయన సన్నిధిలో భరద్వాజగారికి ప్రగాఢమైన చిత్తశాంతి లభించింది. శ్రీ భరద్వాజగారు తమకు స్వామి ఏదైనా ప్రసాదమివ్వాలని కోరుకోగానే ఆయన సిగరెట్టు, ఇడ్లీ, చట్నీ ప్రసాదించారు. డబుల్ టైఫాయిడ్ జ్వరంతో వున్న ఆయనకు ఆ ప్రసాదం వికటించకుండా జ్వరం తగ్గిపోవడమే ఆశ్చర్యం! తిరిగి ఆస్పత్రికి వెళ్ళాలని గుర్తుకు రావడంతో ఆయనకు తమ జ్వరం సంగతి కూడా గుర్తొచ్చింది. చివరకు ఎలాగో సాహసించి, "నమస్కారం స్వామీ!" అన్నారు భరద్వాజగారు. ఆయన పలుకలేదు. అసలు వినిపించుకొన్నట్లే లేదు. మళ్ళీ అదే మాట అన్నారు. మళ్ళా మౌనమే. "వెళ్ళొస్తాను స్వామీ! నమస్కారం" అన్నారు. అందుకు స్వామి సరేనన్నట్లు తలవూపి, ప్రతి నమస్కారంగా చేతులు కలిపారు. ఆయన తిరిగి ఆస్పత్రికి వెళ్ళారు.

భరద్వాజగారు అప్పటినుండి జిల్లెళ్ళమూడి నుంచి ప్రెస్ పనిమీద బాపట్ల ఎప్పుడు వచ్చినా చీరాల వెళ్ళి ఆ స్వామిని తప్పక దర్శించుకొనేవారు. వెళ్ళినప్పుడల్లా ఆయన భరద్వాజగారి చేత టిఫిను, కాఫీ, సిగరెట్టూ సేవింపజేసేవారు. స్వామిని దర్శించినప్పుడల్లా ఆయనకు కలిగే చిత్తశాంతి ఆ తర్వాత సుమారు నెల రోజుల వరకూ వుండి ఆయన నిత్యమూ చేసుకునే ధ్యానాన్ని ఎంతో పటిష్టం చేసేది. ఆయన దగ్గరకు వెళ్తుంటే తమ తండ్రి దగ్గరకు వెళ్తున్నట్లనిపించేది – భరద్వాజ గారికి. ఈ అఖిల జగత్తూ ఒక యెత్తు, ఆయనొక్కరూ ఒక యెత్తూ అనిపించేది. ఆయన ఈ చరాచర జగత్తులోని ప్రతి అణువులోనూ ఒకే బ్రహ్మం నిండి వున్నట్లు అనుక్షణం

దర్శిస్తూంటారని అనిపించేది. ఆయన మౌనముద్ర ఈ జగత్తులోని శబ్దానికి, నిశ్శబ్దానికీ ఆధారమైనట్లు తోచేది. ఆయన తలనుండి వ్రేలాడే జడలు సృష్టి అనే మఱ్ఱిచెట్టు ఊడల్లాగా – నిత్య పరిణామం ద్వారా నిత్యనూతనత్వాన్ని చెందుతూ వుండే సృష్టి అనే మఱ్ఱి చెట్టంతటా వ్యాపించి వున్న బ్రహ్మ చైతన్యం, భక్తులమీద కృపచేత వారిని ఉద్ధరించడానికి సృష్టి నుండి ఆవిర్భవించే పరిపూర్ణ మహాత్ముల రూపాలలాగా కనిపించేవి.

మాస్టరుగారు మొట్టమొదటగా ఆయనను దర్శించినపుడు టైఫాయిడ్ జ్వరంలో వున్న తమకు యిడ్లీ, దోసె, కారప్పొడి, చట్నీ తినిపించి సిగరెట్టు ప్రసాదంగా యిచ్చారని చెప్పారు. అయితే, తమను ప్రేమతో అనుగ్రహించేందుకై వచ్చారని గ్రహించిన ఆ అవధూత స్వామి ఆనందంతో తమ దైవమైన శ్రీ దత్తావతారులు శ్రీ భరద్వాజగారికి ఆయా ఆహార పదార్థాలను, సిగరెట్టును భక్తితో నివేదనగా సమర్పించుకొని ఆరాధించుకొన్నారన్న విషయం ఈ క్రింద జరిగిన సన్నివేశాల ద్వారా నిరూపణ అవుతుంది.

ఒకసారి ఉదయం 8గం॥ల సమయంలో శ్రీ భరద్వాజగారు చీరాల వెళ్ళారు. స్వామి ఆ సమయంలో ఒక రోడ్డు ప్రక్కన ఒక హోటలుకు ఎదురుగా కూర్చుని వున్నారు. భరద్వాజగారిని చూస్తూనే స్వామి యిడ్లీ తీసుకొని రమ్మన్నారు. ఆయన యిడ్లీ తీసుకొని వచ్చారు. ఆ యిడ్లీ పొట్లాన్ని స్వామి తమ చేతిలోకి తీసుకొని దానికేసి కొద్ది క్షణాలు చూసి "నువ్వు తినయ్యా!" అంటూ తిరిగి భరద్వాజగారి చేతికిచ్చారు. "మీరు తినండి స్వామీ! నేను మళ్ళీ తెచ్చుకుంటాను" అన్నారు భరద్వాజగారు. స్వామి అలా కాదని అడ్డంగా తలవూపారు. స్వామి ఆజ్ఞననుసరించి ఆయన యిడ్లీ తినటం మొదలుపెట్టారు.

ఒక యిడ్లీ సగం తినగానే స్వామి మిగిలిన సగభాగం యిడ్లీ భరద్వాజగారి నుండి లాక్కొని తినేశారు. భరద్వాజగారు భయంతో, బాధతో "స్వామీ! అదేమిటి? మీరు నా ఎంగిలి తింటున్నారు" అనగానే "ఏం లేదులేయ్యా!" అన్నారు స్వామి. తర్వాత పొట్లంలో వున్న మరొక యిడ్లీ తీసుకొని "ఇది తినయ్యా!" అంటూ భరద్వాజగారి చేతికిచ్చారు. ఆ యిడ్లీ నీళ్ళగా వున్న చట్నీలో నాని వున్నదేమో, ఆయన ఒక ప్రక్క నోటిలో పెట్టుకొని కొరకగానే మిగిలిన ముక్క విరిగి రోడ్డుమీద మట్టిలో పడింది.

భరద్వాజగారు ఎంతో ఆందోళనతో స్వామి కళ్ళలోకి చూడగానే స్వామి ఎంతో కరుణతో భరద్వాజగారి కళ్ళల్లోకి చూచి, యిసుకతో కప్పబడిన ఆ యిడ్లీ ముక్కను మట్టితో సహా నమిలి మింగేశారు. తర్వాత మరొక యిడ్లీ భరద్వాజగారి చేతికిచ్చి "యిది తిను స్వామీ!" అన్నారు. మాస్టరుగారు ఆ యిడ్లీని అతి జాగ్రత్తగా తిన్నారు. భరద్వాజగారు, చీరాలస్వామిని గురించి చెపుతూ, "ఆయన వద్దకు వెళ్తుంటే నా తండ్రి దగ్గరకు వెళ్తున్నాననిపిస్తుండేది" అన్నారు. స్వామి కూడా, భరద్వాజగారు వారి వద్దకు వచ్చి తిరిగి సెలవు తీసుకొని వెళ్ళేటప్పుడు వెళ్ళిపోతున్న ఆయనకేసి తదేకంగా చూసి ఆయన కనుమరుగు కాగానే దుఃఖించేవారు. అలా దుఃఖిస్తున్న స్వామిని చూచి స్వామిని సన్నిహితంగా సేవించే చంద్రం అనే భక్తునికి గబగబా స్టేషన్ కు వచ్చి భరద్వాజగారిని వెనుకకు పిలచి స్వామి వద్దకు తీసుకు వెళ్ళాలనిపించేది. కానీ మళ్ళీ 'భరద్వాజగారు ఉద్యోగస్థులు. డ్యూటీకి వెళ్ళక తప్పదు. ఆయన రావాలని నిజంగా స్వామి గనుక సంకల్పించినట్లయితే ఆయన రాకుండా వుండగలరా? పరుగెత్తికెళ్ళి చెప్పక్కర్లేదులే' అనుకొని ఊరుకునే వాడు.

స్వామిని కొందరు పిల్లలు డబ్బులిమ్మని చేయిచాపితే ఆయన యిస్తుండే వారు. ఆ పిల్లలను స్వామి తరచూ "ఆ ఎర్రస్వామి ఎప్పుడొస్తాడయ్యా?" అని అడుగు తుండేవారు. వాళ్ళు తమకు తెలియదని చెపితే "రేపు వస్తాడులే" అనేవారట. ఆయన అన్నట్లే మర్నాడు మాస్టరుగారు చీరాల వెళ్ళటం జరిగేది.

ఒకసారి స్వామి భరద్వాజగారికి ఒక చీరెను ప్రసాదించి, "ఇది కప్పుకో అయ్యా!" అన్నారు. అది చూచిన కొందరు "భరద్వాజగారు గృహస్థులవ్వవలసి



వుంటుందని స్వామి యొక్క ఆ చర్యకు అర్థం" అని అన్నారు.

స్వామి ఆరోగ్యం ఆందోళనకరంగా వున్నప్పుడు సన్నిహిత భక్తులయిన చంద్రం, మరియమ్మలు "స్వామీ! మీ వాళ్ళెవరయినా వుంటే చెప్పండి. టెలిగ్రాం యిస్తాం" అని అంటూ ఆయన వద్దకు వచ్చే భక్తులందరి పేర్లు చెపుతుంటే ఆయన మౌనం వహించారు. భరద్వాజగారి పేరు చెప్పగానే ఆయనకు వుత్తరం వ్రాయమని అన్నారు. అయితే ఆ ఉత్తరం చేరేలోపలే భరద్వాజగారు స్వామి వద్దకు వెళ్ళారు. ఆ చిత్రమైన సన్నివేశం యీ విధంగా జరిగింది.

సెప్టెంబర్ 2వ తేదీ 1973వ సం॥లో భరద్వాజగారు విద్యానగర్ లో కాలేజీలో తమ తరగతి గదిలోకి వెళ్తుండగా కళ్ళముందు చీరాల అవధూత స్వామి దర్శన మిచ్చారు. భరద్వాజగారు ఆయన రూపాన్ని దర్శిస్తూ ఎదురుగా వున్న తరగతి గదిలోని డయాస్ ను చూడక తట్టుకొని క్రిందపడి పోయారు. వెంటనే చీరాల బయలుదేరి వెళ్ళగా తమ అంతిమ సమయంలో భరద్వాజగారిని చెంతకు పిలిపించుకొన్న అవధూతస్వామి ఆ మర్నాడే 3-9-1973వ తేదీన భరద్వాజగారి సమక్షంలో తుదిశ్వాస విడిచారు. దీనిని బట్టి నివురుగప్పిన నిప్పువలె అతిసాధారణంగా కనిపించే భరద్వాజగారిని అవధూతస్వామి శ్రీ దత్తునిగా గుర్తించి, ఆరాధించారని తెలుస్తుంది. మొట్టమొదటి దర్శనంలోనే భరద్వాజగారు ఆయనకు నమస్కరించగానే స్వామి చేతులు జోడించి భరద్వాజగారికి నమస్కరించారు. వారి ఉచ్ఛిష్టాన్ని అత్యంత ప్రీతితో స్వీకరించటం, ప్రతిక్షణం భరద్వాజగారినే స్మరించటం ఆయన తమ వద్దకు వచ్చి కనుమరుగవగానే ఆయన కోసం దుఃఖించటం యివన్నీ కూడా యీ విషయాన్ని ధృవపరుస్తాయి.

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

*శ్రీమతి మధునాపంతుల ప్రియ*

నా చిన్నతనంలో మా నాన్నగారు ఒకరోజు క్యాలెండర్లు అమ్ముకునే అతనిదగ్గర శిరిడీ సాయిబాబా క్యాలెండర్ కొని, చాలా బాగుందని ఇంటికి తీసుకువచ్చారు. మా ఇంట్లో అందరం ప్రతిరోజు క్యాలెండర్ లోని బాబాకి నమస్కారం చేసుకునేవాళ్లం. అలాగే బాబా గుడికి కూడా వెళ్ళేవాళ్ళం. ఆ విధంగా బాబా మా జీవితాల్లోకి ప్రవేశించారు. అయితే,,,వారి చరిత్ర గ్రంథం పారాయణ చెయ్యడం కానీ, హారతులు చేసుకోవడం, సత్సంగం చెయ్యడం,,,,ఇవేవీ అప్పుడు చేసేవాళ్ళంకాదు.

2000 సంవత్సరంలో మా అమ్మగారికి, బాబాగారు ఒక రథంలో నన్ను తన పక్కన కూర్చోబెట్టుకుని ఎక్కడికో తీసుకువెడుతున్నట్లు స్వప్నం వచ్చిందిట. తరవాత వెంటనే మంచి సంబంధం రావడం, నాకు పెళ్లి కుదరడం, మావారు అమెరికాలో ఉద్యోగం చేస్తున్న కారణంగా నేను అమెరికా వెళ్ళడం జరిగింది. ఇలా జరగబోతోందని ఆ స్వప్నం ద్వారా బాబా తెలియచేశారని మా అమ్మ భావించింది. తరవాత నా జీవితంలో జరిగిన సంఘటనలదృష్ట్యా చూస్తే, "ఈ అమ్మాయి బాధ్యతంతా నాది" అని మా అమ్మకి బాబాగారు సూచించినట్లు అనిపిస్తుంది.

2002లో నాకు పాప పుట్టింది. తనకి నాలుగు సంవత్సరముల వయసున్నప్పుడు, మేము తిరుపతి, శిరిడి దర్శనం చేసుకుందామని, భారతదేశానికి వచ్చాము. ఒకరోజు శిరిడి బయలుదేరడానికి బస్టాండ్ లో కూర్చుని ఉంటే, నాలుగేళ్ల మా అమ్మాయి "అమ్మా! తమ్ముడు ఎప్పుడు వస్తాడు?" అని అడిగింది. అసలు మా అమ్మాయి ఎప్పుడూ అలా మాట్లాడలేదు. పైగా చాలా తక్కువ మాట్లాడే అమ్మాయి! నేను ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాను. మేము శిరిడి బయలుదేరినప్పుడు మావారు చెయ్యబోయే వ్యాపారం నిమిత్తం బాబా ఆశీస్సులు కోరుకొమ్మని మా వాళ్ళు చెప్పారు. మేము సరే అన్నాము. తీరా వారి దర్శనమయ్యాక, ఆ సంకల్పం మర్చిపోయి, నేను హఠాత్తుగా "ఏవండీ మనకు బాబు పుట్టాలని దణ్ణం పెట్టుకుందాం" అన్నాను. మావారు కూడా 'సరే' అన్నారు. వ్యాపారం విషయం ఇద్దరం మర్చిపోయాం. మా భావం ఎందుకలా మారిందో అర్థం కాలేదు.

తిరిగి అమెరికా వెళ్ళిన కొన్ని రోజులకు నేను గర్భందాల్చాను. మూడో నెలలో గర్భానికి సంబంధించిన ఒక సమస్య వచ్చి, :ప్రసవం అయ్యే వరకు, అస్సలు కదలకుండా విశ్రాంతి తీసుకోవాలి' అన్నారు. మా వాళ్లెవరికీ అమెరికా రావడానికి పరిస్థితులు అనుకూలంగా లేవు. ఒకవైపు మా పాపని చూసుకోవడం, ఇంకొకవైపు ఇంటిపనులు, మావారికి ఉద్యోగ విధులు ఇవన్నీ చాలా ఇబ్బందిగా ఉండేవి. మేము శిరిడి వెళ్ళినప్పుడు ఒక బాబా ఫోటో కొనుక్కున్నాను. ఆ ఫోటోని ఎదురుగా పెట్టుకుని, వారితో నా పరిస్థితి చెప్పుకుని బాగా ఏడ్చేదాన్ని. అప్పుడు బాబా ఒక అద్భుతమైన లీల చేశారు! మాఊరిలో అంటే ఏలూరులో ఉన్న నా స్నేహితురాలికి కూడా అమెరికా

సంబంధమే చేశారు. కానీ వాళ్ళు మాకు చాలా దూరంలో ఉంటారు. ఎప్పుడూ మేము వాళ్ళని కలవలేదు. అయితే వాళ్ళాయనకు ఉద్యోగరీత్యా మేము ఉండే ప్రాంతానికి బదిలీ అయ్యి, మాకు దగ్గరలోనే ఇల్లు తీసుకున్నారు. నా పరిస్థితి చూసి, నువ్వేమీ బాధపడకు, అనిచెప్పి తనే ప్రతిరోజూ వంటచేసి పంపించేది. ఊహించని ఈ ఏర్పాటుకి మేము చాలా ఆశ్చర్యపోయాము. కొద్దికాలానికి మా అత్తగారు రావడం, బాబా దయవల్ల నాకు సకాలంలో బాబు పుట్టడం జరిగింది.

తరవాత మాకు తెలిసినవాళ్ళు, మావారికి శ్రీ సాయి లీలామృతము గ్రంథం ఇస్తే, ఆయన ప్రతిరోజూ పారాయణ చేసుకునేవారు. నేను పారాయణ చేసేదాన్ని కాదు. ఒకసారి బాబా నాకు స్వప్న దర్శనం ఇచ్చారు. వారి దర్శనమవ్వగానే వెనకనుంచి వాయిద్యాలమోత వినబడింది. ఆయన ఒక సింహాసనం మీద కూర్చున్నారు. వారి కాళ్ళకి బంగారం పాదుకలు ఉన్నాయి. ఆయన కుడికాలు తీసి నా తల మీద పెట్టి, "నన్ను నమ్ము" అని చెప్పారు. మెలకువ వచ్చాక విపరీతమైన ఆనందం వేసింది. తరువాత నేను కూడా పారాయణ చెయ్యడం మొదలుపెట్టాను. పూజ్యశ్రీ మాస్టరుగారి ఇతర గ్రంథాలు కూడా తెప్పించుకుని చదివాను. అప్పుడే శ్రీ ద్వారకబాబుగారితో పరిచయభాగ్యం కలిగింది. ఫోరమ్స్ లో పాల్గొనేదాన్ని. మా ఇంట్లో సత్సంగం కూడా చేసుకునే వాళ్ళం. ఒకసారి సత్సంగం పూర్తయిన తరవాత మా పాప "ఈ గ్రంథాలు పంచమని చెప్పారు" అని శ్రీ సాయి లీలామృతము చూపించింది. ఎవరు? అని అడిగితే, "ఆ గడ్డం ఆయన" అని పూజ్యశ్రీ మాస్టరుగారి పటం చూపించింది. తరవాత మేము అలాగే చేసాము.

నేను గర్భవతిగా ఉన్నప్పుడు నాకు సహాయం చేసిన అమ్మాయికి కృతజ్ఞతగా శ్రీ సాయి లీలామృతం గ్రంథం ఇద్దామనుకుంటే, తను ఎప్పటినుంచో ఆ గ్రంథ పారాయణ చేస్తున్నానని చెప్పింది. అది విన్నాక తన చరిత్ర పారాయణ చేసే అమ్మాయి చేతివంట నేను తినేలా ఏర్పాటు చేసి, నన్ను కన్నతండ్రిలా ఆదుకున్న బాబావారి ప్రేమకు కృతజ్ఞతతో నామనసు నిండిపోయింది.

పిల్లలని మనదేశంలో పెంచాలన్న ఉద్దేశ్యంతో, బాబావారి ప్రేరణతో మేము 2010లో భారతదేశానికి వచ్చేసాము.

మా నాన్నగారికి కొన్నేళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఎప్పటినుంచో మా నాన్నగారు నమ్ముకున్న సమర్థ సద్గురువు సాయినాథుడు ఆయనని ప్రాణాపాయస్థితినించి కాపాడి వైద్యులనే ఆశ్చర్యానికి గురిచేశారు.

ఇలా తనని నమ్ముకున్న ఎందరినో ఉద్ధరిస్తూ, నా వెనకే ఉండి నా జీవితంలో జరిగిన ప్రతిదీ వారి అనుగ్రహమేనని ప్రతిక్షణం నాకు నిరూపిస్తూ, ముఖ్యంగా శ్రీ అలివేలుమంగాసమేత భరద్వాజ మహరాజ్ లను పరిచయం చేసి ఇంతటి ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రసాదించిన సమర్థ సద్గురు సాయినాథునికి వందన సహస్రాలు !!

---

### పాఠకులకు విన్నపము -
### గత సంచికలోని పాఠ్య సవరణ

**జనవరి 2026 సంచికలో, ద్వారకామాయి అనుభవ మండపము శీర్షికలో, 25వ పేజీలో మొదటి కాలమ్ చివరి వరుసలో కొన్ని వాక్యాలు ముద్రించబడలేదు. పాఠకుల సౌకర్యార్థం ఆ భాగాన్ని యిక్కడ యిస్తున్నాము**

**--ఎడిటర్**

**గురువారం వస్తే చాలు...** నాకు ఎంతో వుత్సాహంగా, ఆనందంగా వుండి పొద్దున్నే లేచి త్వరగా యింటి పనులన్నీ చేసుకుని బాబా గుడికి వెళ్ళేదాన్ని. ఆ రోజంతా బాబా నాతోనే వున్నారన్న తన్మయత్వంతో వుండేదాన్ని. ఆ గుడికి ఆర్థిక వనరులు లేవని, శ్రద్ధగా సేవలు జరగటం లేదని నాకు తెలిసింది. నాకు ఏదైనా చేద్దామని బాగా తపనగా వుండేది. బాబాకి కనీసం ఒక గది అయినా నిర్మాణం చెయ్యాలని వుండేది. కానీ మా ఆర్థిక పరిస్థితులు కూడా బాగాలేవు. అప్పుల్లో వున్నాము. ఎటుచూసినా నేనేమీ చెయ్యలేని పరిస్థితి. పైగా మావారు నామాట పడనివ్వరు. వారికి ఈ బాబాలు, ఇవన్నీ... **నచ్చేవి కావు.**

# ఆచార్యుని అద్భుత లీలలు

*శ్రీ మేడా జయరాం*

పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవులతో తన స్మృతులను, అనుభూతులను, అనుభవాలను ఒంగోలు వాస్తవ్యులైన శ్రీ మేడా జయరాంగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...


1980 వ సంవత్సరంలో నాకు మొట్టమొదట కె.వి.రంగారావుగారి ద్వారా పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనభాగ్యం కలిగింది. రెండుసార్లు ప్రింటింగ్ ప్రెస్ దగ్గర వారిని దర్శిద్దామనుకుంటే కుదరలేదు. మూడవసారి వారి ఇంటికి రాత్రి దాదాపు 8:30 గంటలకు వెళ్ళాము. వారు అప్పుడు వాకిట్లో ఒక సత్సంగసభ్యుడితో మాట్లాడుతున్నారు. మేము వెళ్లి ఆయనకు నమస్కారం చేసుకున్నాము.

మరుసటిరోజే మళ్ళీ పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికి వెళ్లాను. నాకు ఏమి మాట్లాడాలో కూడా తెలియదు. కానీ మాటల సందర్భంలో, "మీరు మా ఇంటికి ఒకసారి రావాలి!" అని వారిని ప్రార్థించాను. వారు అంగీకరించి ఒకరోజు మా ఇంటికి వచ్చారు. ఆ రోజుల్లో పెద్దగా ఎవరూ బాబాను పూజించేవారు కాదు. నేను పూజ్యశ్రీ మాస్టరుగారిని ఇంటికి తీసుకువచ్చేసరికి అందరికీ, 'మనిషిని పూజించడమేమిటి?' అనిపించింది. కానీ నేను, నా శ్రీమతి వారికి పాదపూజ చేసుకున్నాము. వారు వెళ్లే ముందు, "నన్ను కాపాడమని బాబాకు చెప్పండి!" అని కోరాను. వారు సరేనన్నారు. ఇక అప్పటినుంచి ప్రతి ఆదివారము తప్పకుండా అయ్యవారి దగ్గరకు వెళ్ళేవాడిని. నేను పూజ్యశ్రీ మాస్టరుగారిని 'అయ్యవార'ని పిలిచేవాడిని.

కొంతకాలంలోనే వారు సామాన్యులు కారని, సాక్షాత్తూ శిరిడీ సాయినాథులేనని అర్థమైంది. 'శ్రీ సాయిలీలామృతము' చదువుతున్నప్పుడు సాక్షాత్తూ బాబాయే వీరి రూపంలో వుండి తమ చరిత్ర చెప్తున్నారనిపించేది. మనకు కావలసిన విషయాలు నోరుతెరిచి అడగలేకపోయినా, ఏదో సందర్భంలో మాట్లాడుతూ మాట్లాడుతూనే మన మనస్సులోని విషయాలు వారికై వారే చెప్పేవారు! వారి వాక్కు వేదవాక్కు. వారు ఏం చెప్పినా జరిగితీరేది!

ఒకసారి నా స్నేహితుడొకడు అయ్యవారితో, "మన జయరాంకి ఏలినాటి శని నడుస్తోంది" అని అంటే, "ఆఁ!





అది మనల్ని ఏం చేస్తుంది? ఏం చేస్తుందోయ్?!"అన్నారు. నిజంగానే నాకేమీ కాలేదు!

ఒకసారి నేనూ, రంగారావుగారు అరుణాచలం వెళ్లాలనుకున్నాము. కానీ కొన్ని పరిస్థితులవల్ల నేను వెళ్ళలేకపోయాను. ఆ విషయం నేను అయ్యవారితో చెప్తే, **"నువ్వు రోజూ ఒక్కసారి నా దగ్గరికి వచ్చిపోతే అరుణాచలం వెళ్లినట్లు!"** అన్నారు. అప్పుడు నేను మనస్ఫూర్తిగా వారికి నమస్కారం చేసుకున్నాను.

మా చిన్నాన్న మా షాపు విషయంలో ఒక అభ్యంతరం పెట్టాడు– 'ఒరేయ్ నువ్వు కొట్లో ప్రతివారికీ అప్పులిచ్చేస్తున్నావు. అలా ఇవ్వవద్దని, ఇందాక ఆరతి సమయంలో బాబా నాతో చెప్పారు' అన్నాడు. "అయితే ఈ విషయం అయ్యవారితో చెప్పి ఆయన ఏమి చెప్తే అది చేద్దాం, రా!" అని అతనిని కూడా తీసుకుని రాత్రి 9:30 గంటలకు అయ్యవారి దగ్గరికి వెళ్లి ఈ సంగతి అడిగాను. అప్పుడు అయ్యవారు, "అవునా! జైరాంకి అప్పులు ఇవ్వకుండా ఎలా కుదురుతుంది? అయినా నేను బాబాను అడుగుతాను. బాబా నాకు చెప్తారు. ఒరేయ్! అంతవరకూ నీ పని నువ్వు చేసుకో!" అని చెప్పి పంపించేశారు. నేను ప్రశాంతంగా ఇంటికి వచ్చాను. ఆ తరువాత ఆయన ఏమీ చెప్పనూ లేదు... నేను మార్చుకోవలసిన అవసరమూ రాలేదు.

సాయిబాబా పత్రిక కమిటీలో నన్ను అయ్యవారు ట్రెజరర్ గా నియమించారు. ఈ విషయం ఇంట్లో చెప్తే, 'ఆ డబ్బుల వ్యవహారాలన్నీ మనకెందుకు? వద్ద'న్నారు. మళ్ళీ ఈ సంగతి అయ్యవారికి చెప్పాను. అప్పుడు వారు, "ఎవరేమన్నా పట్టించుకోకు. నేను చెబుతున్నాను.. నీకేమీ కాదు. నువ్వు వచ్చి అందులో చేరు!" అన్నారు. నాకు వారి మాట బాగా ధైర్యాన్ని ఇచ్చింది. అయినా వారు చెప్పాక ఇక తిరుగేముంది? సరేనని చేరిపోయాను.


**అప్పట్లో మేము అద్దెకున్న ఇంట్లోకి ఎక్కువగా పాములు వచ్చేవి. బాగా ఇబ్బందిగా వుండి అయ్యవారికి చెప్తే, వారు విభూది పొట్లం కట్టి ఇచ్చారు. అది తీసుకుని వెళ్లి ఇంట్లో పెట్టుకున్నాను. అప్పటినుంచి మా ఇంట్లోకి పాములు రానేలేదు! వారి ఆజ్ఞను సకల జీవరాశీ శిరసావహించవలసిందే! అంతేకాదు, మహాత్ముల దర్శనానికి అయ్యవారి దగ్గర ఆశీస్సులు పొంది వెళితే వారి దర్శనము, అనుగ్రహము ప్రత్యేకంగానూ, అద్భుతంగానూ వుండేవి. ఆ మహాత్ములకు అయ్యవారంటే ఎంతటి గౌరవమో!**

ఒకరోజు రాత్రి సత్సంగం అయ్యాక మేము ఇంటికి బయలుదేరుతుంటే కొంతసేపు వుండి వెళ్ళమన్నారు అయ్యవారు. కానీ మేము తొందరపడి బయలుదేరాము. రిక్షా ఎక్కి కొంత దూరం వెళ్ళాక మా రిక్షా తిరగబడింది! కానీ మాకేమీ కాలేదు! అలా కాకుండా చూసుకున్నది కూడా అయ్యవారే! వారు మనకు చాలా సూచనలిస్తారు, కానీ వాటిని గ్రహించి, అనుసరించేది ఎంతమంది?

ఒకసారి అయ్యవారి ఆశీస్సులు, విబూది తీసుకుని నేను శిరిడీకి బయలుదేరాను. కొద్దిసేపటికి మా తమ్ముడి

ద్వారా అయ్యావారు మళ్ళీ విబూది పంపించారు! అదేరోజు రాత్రి మా షాపులో నాలుగు లక్షలు విలువచేసే సరుకు దొంగతనం జరిగింది. కానీ సరుకంతా వెంటనే పట్టుబడింది. ఈ విషయం నాకు ఫోనులో చెప్తే నేను వెనుకకు తిరిగి వచ్చేశాను. పోయిన సరుకు అంత తక్కువ వ్యవధిలో పట్టుబడటం అయ్యావారి కరుణకు నిదర్శనం. మనకు జరగబోయే ప్రతిదీ అయ్యావారికి నిరంతరం తెలుస్తుందని, వారు మనలను ఎప్పుడూ కాపాడుతూ వుంటారనడానికి పై రెండూ ఉదాహరణలే !

అయ్యావారు సమాధి చెందే ముందురోజు రాత్రి నేను వారింటికి వెళ్లాను. అప్పుడు వారు చాలా మామూలుగా, "ఏమీ లేదు, కొంచెం చెయ్యి నొప్పిగా వుంది అంతే!" అన్నారు. చక్కగా మాట్లాడారు. కానీ



మరునాడు ఉదయమే సమాధి చెందారని తెలిసింది. మా కళ్లెదురుగానే లీలావిలాసంగా వారు దేహం వదిలిపెట్టేశారు! ఆ క్షణంలో ప్రతి ఒక్కరమూ ఆ నిజాన్ని నిజమని జీర్ణం చేసుకోలేకపోయాం. మాలో ఒకరిగా వుంటూ వారి గొప్పతనాన్ని కొంచెం కూడా తెలియనివ్వకుండా మరుగుపరచారు.

**వారు సమాధి చెందిన కొద్దిరోజులలోనే పరాడ్ సింగానుంచి అనసూయామాత ఒంగోలులోని బాబా మందిరానికి వచ్చి, ఇప్పుడు బాబా వున్న ప్రదేశంలో కొంతసేపు పడుకున్నారు. అప్పటికి ఇంకా విగ్రహప్రతిష్ఠ జరగలేదు. తరవాత అయ్యావారి బృందావనం దర్శించుకుని, వారికి ప్రదక్షిణలు చేసి నమస్కరించుకున్నారు! అప్పుడు అయ్యావారు మనకు తెలిసినదానికంటే ఎంతో గొప్పవారని అర్థమైంది! గొప్పగొప్ప అవధూతలే నమస్కరిస్తున్నారంటే, సేవిస్తున్నారంటే ఆయన ఎంత గొప్పవారో సామాన్యులమైన మనకు ఎలా తెలుస్తుంది? తరువాత అనసూయమాత పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి కూడా వెళ్లారు.**

అయ్యావారు సమాధి అనంతరం కూడా మమ్మల్నందరినీ కంటికి రెప్పలా కాపాడుతూనే వున్నారు. వారిది సంపూర్ణమైన ప్రేమతత్త్వం. అపారమైన కరుణ. వారి కరుణ పొందినవారికి వారిని తలచుకోగానే కళ్ళవెంట నీళ్లు రాకుండా వుండవు. మనం బాగా పారాయణ చేసి, సమయాన్ని సద్వినియోగం చేసుకుని వారి దర్శనానికి వెళితే, నేటికీ వారు చూపించే అపారప్రేమ అనుభవమౌతుంది. మానవజన్మ ఎత్తినందుకు అయ్యావారిని కళ్లారా చూడగలగటమే మహద్భాగ్యం. అటువంటిది మాలో ఒకరిగా కలసిపోయి మాకు వారి సన్నిధిని ప్రసాదించిన వారి సహృదయతకు కృతజ్ఞతతో శిరస్సువంచి అంజలి ఘటించి నమస్కరిస్తున్నాను.●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ (రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master *(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |











మార్చి 06, 2026న జరగబోయే పూజ్య గురుదంపతుల లీలా కళ్యాణ మహోత్సవానికి సన్నాహాలు మొదలుపెడుతూ **శ్రీ విఘ్నేశ్వరుని పూజ, పసుపు దంచడం కార్యక్రమాలు** శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానములో గురు పుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు, శ్రీమతి లయరాగిత గారు మరియు గురుపుత్రిక శ్రీమతి వేదమ్మ గారు, శ్రీ శ్రీకాంత్ గార్ల ఆధ్వర్యంలో జనవరి 15వ తేదీన జరిగాయి.

భక్తులందరూ ఆనందోత్సాహాలతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd. No. APTEL/26/A0220



పూజ్య గురు దంపతులు శ్రీ ఎక్కిరాల భరద్వాజ్ మహారాజ్
మరియు శ్రీ అలివేలు మంగమ్మ తల్లి ల లీలా కళ్యాణ మహోత్సవము
ఫిబ్రవరి 11, 2026 (తిథి-మాఘ బహుళ నవమి) | మార్చి 6, 2026 (ఆంగ్ల కాలమాన ప్రకారము)

This periodical is published by Revuri Seshachala Sasidhar from Ongole on behalf of Ekkirala Vikramaditya, edited by Revuri Seshachala Sasidhar and printed by Janatha Offset Printers at Nirmal Nagar, Ongole".
[according to the Press and Registration of Periodicals (PRP) Act, 2023].